తరంగాలు

రిపోర్టర్లు కావలెను

అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.

సంప్రదించండి...

ఎడిటర్: గడ్డం నాగరాజు గౌడ్

94949 23460

https://epaper.tharangalu.in

RNI. TELTEL / 2022 / 83463

జాతీయ దిన పత్రిక

# తరంగాలు

Tharangalu Daily News Paper

ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
ఆదివారం
03 మే 2026
సంపుటి 03
సంచిక 205
పేజీలు 8
వెల రూ.5.00

Published From : Hyderabad,Circulated:Telangana,Andhrapradesh

Epaper: www.tharangalu.in.com

## మృత్యు ఒడిలోనూ
# వీడని మాతృత్వం



- బార్గి డ్యామ్‌లో విషాదం
- మరణించినా బిడ్డను వీడని తల్లి ప్రేమానుబంధం!
- తల్లీకొడుకుల మరణం, కంటతడి పెట్టించిన దృశ్యం
- పర్యాటక భద్రతా లోపాలు, తొమ్మిది మంది బలి
- విచారణకు ఆదేశించిన పర్యాటక శాఖ

జబల్‌పూర్, మే 2 (తరంగాలు ప్రతినిధి): మధ్యప్రదేశ్ రాష్ట్రం జబల్‌పూర్ జిల్లాలోని బార్గి డ్యామ్‌లో జరిగిన ఘోర పడవ ప్రమాదం యావత్ దేశాన్ని కలచివేసింది. ఏప్రిల్ 30, గురువారం సాయంత్రం సుమారు 5:00 గంటలకు నర్మదా నదిపై పర్యాటక బోటు ప్రయాణిస్తుండగా అకస్మాత్తుగా బలమైన తుపాను రావడంతో ఈ ప్రమాదం సంభవించింది. ఢిల్లీకి చెందిన మెరీనా మస్సే (39), ఆమె నాలుగేళ్ల కుమారుడు త్రిషాన్ ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయారు. శుక్రవారం ఉదయం రెస్క్యూ టీమ్ మృతదేహాలను వెలికితీసే సమయంలో కనిపించిన దృశ్యం అందరినీ కన్నీరు పెట్టించింది. మరణించినా కూడా ఆ తల్లి తన కుమారుడిని గుండెలకు గట్టిగా హత్తుకుని ఉండటం ఆమె మాతృత్వానికి నిదర్శనంగా నిలిచింది.

ఢిల్లీ నుండి ఒక గృహప్రవేశం వేడుక కోసం జబల్‌పూర్ వచ్చిన ఈ కుటుంబంలో తండ్రి ప్రదీప్ కుమార్, కుమార్తె సియా ప్రాణాలతో బయటపడగా, తల్లి కుమారుడు మృత్యువాత పడ్డారు. ప్రమాద సమయంలో బోటులో సుమారు 40 మందికి పైగా ఉన్నట్లు సమాచారం. గాలివాన తీవ్రతకు బోటు నియంత్రణ కోల్పోయి నిమిషాల వ్యవధిలోనే నీటిలో మునిగిపోయింది. సహాయక చర్యలు చేపట్టిన రెస్క్యూ టీమ్ ఇప్పటివరకు సుమారు 28 మందిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చగలిగింది. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు మొత్తం తొమ్మిది మంది పర్యాటకులు మరణించినట్లు అధికారులు ధృవీకరించారు.

పర్యాటక శాఖ నిర్లక్ష్యం వల్లే ఈ ఘోరం జరిగిందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రమాదానికి గురైన బోటులో తగినన్ని లైఫ్ జాకెట్లు అందుబాటులో లేవని ప్రాథమిక విచారణలో తేలింది. వాతావరణం అనుకూలించకపోయినా, తుపాను హెచ్చరికలు ఉన్నా ప్రయాణానికి అనుమతించడంపై బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఇంత పెద్ద ఎత్తున ప్రాణనష్టం

మిగతా 2వ పేజిలో..



## పీఆర్సీపై కీలక నిర్ణయాలకు
# రంగం సిద్ధం

- ఉద్యోగుల సంక్షేమంపై సీఎం స్పష్టమైన హామీలు
- 100 రోజుల్లో రూ. 6 వేల కోట్లు రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లింపు
- ఉద్యోగ సంఘాలతో విస్తృత చర్చలు -- నిరసనలు ఉపసంహరణ

హైదరాబాద్, మే 02 తరంగాలు ప్రతినిధి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన పే రివిజన్ కమిషన్ (పీఆర్సీ) అంశంపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. పీఆర్సీ నివేదికను తక్షణమే అందించాలని అధికారుల కమిటీకి ఆదేశించినట్లు వెల్లడించారు. నివేదిక అందిన వెంటనే సమగ్రంగా పరిశీలించి ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేశారు.

తెలంగాణ ఉద్యోగ సంఘాల సంయుక్త కార్యాచరణ కమిటీ (జేఏసీ), ఎంప్లాయీస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ప్రతినిధులతో జరిగిన సమావేశంలో సీఎం విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు పలువురు ఎంపీలు, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఉద్యోగుల సమస్యలు, డిమాండ్లు, సంక్షేమ అంశాలపై సుదీర్ఘంగా చర్చలు జరిగాయి. ఉద్యోగుల సంక్షేమం పట్ల ప్రభుత్వం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందని సీఎం తెలిపారు. వచ్చే వంద రోజుల్లో పదవీ విరమణ చేసిన ఉద్యోగుల బెనిఫిట్స్ కోసం రూ. 6 వేల కోట్లు విడుదల చేసి చెల్లింపులు పూర్తి చేస్తామని ప్రకటించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యను

మిగతా 2వ పేజిలో..



## పూణేలో చిన్నారిపై దారుణం..
# నిందితుడు అరెస్ట్

- నాలుగేళ్ల బాలికపై అత్యాచారం, హత్య ఘటన
- సీసీ దృశ్యాలతో బయటపడిన నేరం
- ఆందోళనలకు దిగిన స్థానికులు, కఠిన చర్యల డిమాండ్

పూణే, మే 02 తరంగాలు ప్రతినిధి మహారాష్ట్రలోని పూణే పరిధిలో దారుణ ఘటన చోటుచేసుకుంది. నాలుగేళ్ల చిన్నారిపై ఓ వృద్ధుడు అత్యాచారం చేసి హత్య చేసిన సంఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం భోర్ తహసీల్ పరిధిలోని గ్రామంలో ఈ ఘటన జరిగింది. చిన్నారిని ఆహారం ఇస్తానని చెప్పి ఓ వృద్ధుడు

మిగతా 2వ పేజిలో..

# అత్తను హతమార్చిన అల్లుడు

- సీసీ దృశ్యాలతో బయటపడ్డ నిజం
- కుటుంబ కలహం ఘోరానికి దారి



మేడ్చల్, మే 02తరంగాలు ప్రతినిధి కుటుంబ వివాదం దారుణంగా మారి ఒక మహిళ ప్రాణాలు కోల్పోయిన సంఘటన మేడ్చల్ జిల్లాలో కలకలం రేపింది. చెంగిచర్లలో చోటుచేసుకున్న ఈ ఘటనలో అల్లుడు తన అత్తను హత్య చేసిన విషయం వెలుగులోకి వచ్చింది. మొదట ప్రమాదంగా చూపించేందుకు ప్రయత్నించినా, సీసీ కెమెరా దృశ్యాలతో అసలు నిజం బయటపడింది. మృతురాలు కొల్ల అరుణకు ఇద్దరు కుమార్తెలు ఉండగా, చిన్న కుమార్తె కావ్య ప్రేమ వివాహం చేసుకుంది. ఆమె భర్త కర్రు స్నేహిత్‌తో కొంతకాలంగా విభేదాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే అత్తతో అల్లుడు

మిగతా 2వ పేజిలో..

## కాంగ్రెస్ ప్రభుత్వాన్ని
# గద్దె దించుతా

- మీట్ ది ప్రెస్‌లో కవిత సంచలన వ్యాఖ్యలు
- "విద్య, వైద్యం ఉచితం కాకపోతే ప్రజలు ప్రశ్నించాలి"
- కేసీఆర్‌పై రాజకీయ విమర్శలే చేశానన్న స్పష్టీకరణ
- ప్రజల కోసం పోరాటమే లక్ష్యం



హైదరాబాద్, మే 02 తరంగాలు ప్రతినిధి బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. విద్య, వైద్యం ప్రజలకు ఉచితంగా అందకపోతే ప్రజలు గట్టిగా ప్రశ్నించాలని, అవసరమైతే తీవ్ర నిరసనలు వ్యక్తం చేయాలని పిలుపునిచ్చారు. పాంచజన్యంలో ప్రకటించిన ఐదు ప్రధాన అంశాలను అమలు చేయడంలో తాను ఇచ్చిన మాట తప్పితే తాను బాధ్యత వహిస్తానని కవిత స్పష్టం చేశారు. హామీలు ఇచ్చే

మిగతా 2వ పేజిలో..

## గ్యాస్ ధరల పెంపుపై
# షర్మిల తీవ్ర విమర్శలు

- ఎన్నికల తర్వాత 'బండ బాదుడు' అంటూ మండిపాటు
- చిన్న వ్యాపారులు, విద్యార్థులపై భారమని ఆందోళన
- ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్




అమరావతి, మే 02 : వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలను భారీగా పెంచడంపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రధాని నరేంద్ర మోదీపై నేరుగా దాడి చేస్తూ, ఎన్నికల సమయంలో వాగ్దానాలు చేసి తర్వాత ప్రజలపై భారాలు మోపడం అలవాటుగా మారిందని ఆరోపించారు. ఐదు

మిగతా 2వ పేజిలో..

## బీమా రంగంలో వందశాతం
## విదేశీప్రత్యక్ష పెట్టుబడులు

- ఎల్ఐసిలో మాత్రం 20శాతానికే పరిమితం
- చట్టానికి చేసిన మార్పులపై కేంద్రం నోటిఫై




న్యూఢిల్లీ,మే2 బీమా రంగంలో ఆటోమేటిక్ రూట్‌లో 100 శాతం ఎఫ్‌డీఐ అంటే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ను అనుమతిస్తూ చట్టానికి చేసిన మార్పులను కేంద్రం తాజాగా నోటిఫై చేసింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ఒక నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. అయితే, ఎల్ఐసీలో మాత్రం ఈ తరహా పెట్టుబడులు 20 శాతానికి పరిమితమని కూడా ఆర్థిక శాఖ తన ప్రకటనలో స్పష్టం చేసింది. దీంతో, విదేశీ పెట్టుబడి దారులు భారతీయ ఇన్సూరెన్స్ కంపెనీల్లో నేరుగా పెట్టుబడి పెట్టేందుకు మార్గం సుగమమైంది. అయితే,

మిగతా 2వ పేజిలో..

## కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించుతా

➢ మొదటి పేజి తరువాయి

ముందు ఆర్థిక నిపుణులతో చర్చించి సాధ్యాసాధ్యాలను అంచనా వేసిన తర్వాతే నిర్ణయాలు తీసుకున్నానని చెప్పారు. ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో ప్రాధాన్యత కేటాయిస్తే ప్రజలకు విద్య, వైద్యం ఉచితంగా అందించడం సాధ్యమేనని వివరించారు. రాష్ట్రంలో ప్రజలు తమ ఆదాయంలో పెద్ద భాగాన్ని విద్య, వైద్యానికి ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సంకల్పం ఉంటే ఈ పరిస్థితిని మార్చవచ్చుని, గతంలో ఆరోగ్యశ్రీ, ఉచిత భోజన పథకాలు కూడా మొదట విమర్శలు ఎదుర్కొన్నప్పటికీ విజయవంతంగా అమలయ్యాయని గుర్తుచేశారు.

రాజకీయ విమర్శలపై స్పందిస్తూ, తన వ్యాఖ్యలు కేవలం రాజకీయ నేతగా ఉన్న కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుపై మాత్రమేనని, తండ్రిగా ఆయనతో ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేశారు. సిద్ధాంతపరమైన భేదాల కారణంగానే విమర్శలు చేశానని తెలిపారు. కృష్ణా, గోదావరి జలాల వినియోగం, ప్రాజెక్టుల నిర్వహణలో లోపాల వల్ల రాష్ట్రానికి నష్టం జరిగిందని వ్యాఖ్యానించారు.కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించిన కవిత, ప్రజల సమస్యలను పట్టించుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. వెయ్యి రోజుల్లో ఈ ప్రభుత్వాన్ని గద్దెదించేందుకు క్షేత్రస్థాయిలో పోరాటం చేస్తామని ప్రకటించారు. తాము అధికారంలోకి వస్తే తల్లిలా ప్రజల కోసం పనిచేసే పాలన అందిస్తామని చెప్పారు. పార్టీ పేరుపై జరిగిన చర్చల గురించి మాట్లాడుతూ వ్యూహాత్మకంగా నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. పార్టీ స్థాపనలో అనేక సాంకేతిక, రాజకీయ అంశాలు ఉంటాయని, వాటిని సమర్థంగా ఎదుర్కొన్నామని చెప్పారు. విమర్శలు చేసిన వారిని పట్టించుకోబోమని, ప్రజల కోసం ముందుకు సాగుతామని స్పష్టం చేశారు.మహిళల సాధికారతపై ప్రత్యేకంగా మాట్లాడుతూ తమ పార్టీలో కనీసం 33 శాతం సీట్లు మహిళలకు కేటాయిస్తామని ప్రకటించారు. మహిళలు పరిపాలనలో ముందుకు రావాలని, తమ పార్టీ ఇందుకు వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. జాతీయ రాజకీయాలపై మాట్లాడుతూ డీలిమిటేషన్ వ్యవహారంలో రాష్ట్రాలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని, రాజ్యసభకు మరింత అధికారం కల్పించాలన్న అభిప్రాయాన్ని వెల్లడించారు. అన్ని రాష్ట్రాలకు సమాన ఓటింగ్ హక్కులు ఉండాలని చెప్పారు.మావోయిస్టుల అంశంపై స్పందిస్తూ ప్రధాన ప్రవాహంలోకి రావాలని, రాజకీయ పార్టీలలో చేరాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రక్షణ సేన వారికి స్వాగతం పలుకుతుందని తెలిపారు. ప్రజల మద్దతుపై విశ్వాసం వ్యక్తం చేసిన కవిత, కొత్త ఆలోచనలను ఈ నేల ఎప్పుడూ ఆదరిస్తుందని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమని, అభివృద్ధి, సామాజిక న్యాయం రెండు చక్రాల్లా ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు.

## బతుమ్మకుంట ముమ్మాటికీ చెరువే

### అక్కడ చెరవు పదెకరాల్లో ఉన్నట్లు నాసా చిత్రాలు ఉన్నాయి

### ఎడ్ల సుధాకర్ హైకోర్టుకు వెళ్లడంపై హైడ్రా కమిషనర్ వివరణ

హైదరాబాద్,మే2 హైదరాబాద్ బతుకమ్మ కుంట చెరువు భూమి తనదే అని, అక్కడ తాను వ్యవసాయం కూడా చేసినట్లు హైకోర్టును ఎడ్ల సుధాకర్ ఆశ్రయించిన క్రమంలో అందుకు ఆధారాలు లేవని, అయినా చెరువును ఆక్రమించి వ్యవసయాం చేయడం కూడా నేమేనని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. ఈ అంశం ఇటీవల పెద్దఎత్తున చర్చకు తెరలేపింది. దీనిపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ తాజాగా స్పందించారు. బతుకమ్మ కుంటను హైడ్రా అభివృద్ధి చేయడంపై ఎడ్ల సుధాకర్ పిటిషన్ వేశారని తెలిపారు. 1986 నాటి అన్ రిజిస్టర్డ్ సేల్ అగ్రిమెంట్ మాత్రమే ఆయన వద్ద ఉందని.. రిజిస్టర్డ్ అగ్రిమెంట్ ఉంటేనే రూల్ ప్రకారం చెల్లుబాటు అవుతుందని రంగనాథ్ అన్నారు. బతుకమ్మ కుంట అభివృద్ధిపై డివిజన్ బెంచ్‌కు సుధాకర్ వెళ్లారని.. కంటెంప్ట్ ఆర్డర్‌లో కోర్టు తమను తప్పుపట్టిందని హైడ్రా కమిషనర్ చెప్పారు. డివిజన్ బెంచ్ ఆదేశాల ప్రకారం అక్కడ బోర్డులు, ఇతర నిర్మాణాలు తొలగించామని వెల్లడించారు. హైకోర్టు ఆదేశాలను తాము పాటిస్తామని స్పష్టం చేశారు. సుధాకర్ అసలు అక్కడ చెరువే లేదని అంటున్నారని.. కానీ 1990 నాటి నాసా శాటిలైట్ ఫొటోల్లో బతుకమ్మ కుంట కనిపిస్తోందన్నారు. 1970లో భారతీయ సర్వే ఆఫ్ ఇండియా నీటి సర్వేల్లోనూ పూర్వం నుంచే చెరువు ఉన్నట్లు తేలిందన్నారు. ఎర్రకుంట పేరుతో 1975 పహానీలలో 563/-1తో బతుకమ్మ కుంట ఉందన్నారు. సుధాకర్ భూమిని చెరువుగా మార్చామనేది నిజం కాదని.. తమ వద్ద ఉన్న అన్ని ఆధారాలను కోర్టుకు సమర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు నార్సింగ్‌లోని ముష్కిమ్ చెరువు ఆక్రమణ కూల్చివేతలపై ముందుగానే సమాచారం ఇచ్చామని హైడ్రా కమిషనర్ తెలిపారు. సున్నం చెరువు బాధితులతో సమావేశం ఏర్పాటు చేశామని.. సీఎం ఆదేశాలతో వారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కూడా ఇస్తున్నట్లు వెల్లడించారు.

## విజయవాడ నుంచే హజ్ ఏర్పాట్లు

### మంత్రి ఫరూక్ వెల్లడి

నెల్లూరు,మే2 వచ్చే ఏడాది నుంచి రాష్ట్రంలోని ముస్లింలందరూ విజయవాడ నుంచే హజ్ యాత్రకు వెళ్లేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం' అని మంత్రి ఎండీ ఫరూఖ్ అన్నారు. విజయవాడ నుంచి 335 మంది హజ్ యాత్రకు బయలుదేరారు. యాత్రికులకు ప్రభుత్వం తరపున ఒక్కొక్కరికి రూ.1 లక్ష చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నాం అని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ముస్లింల సంక్షేమం, వక్ఫ్‌బోర్డు ఆస్తుల పరిరక్షణ, పేదల అభ్యున్నతి కోసం ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపడుతోందని మంత్రి ఫరూక్ అన్నారు. దేవాదాయ శాఖ కంటే ఎక్కువగా పట్టణ ప్రాంతాల్లో వక్ఫ్‌బోర్డుకు భారీగా ఆస్తులున్నాయి. కానీ.. గత ప్రభుత్వాల హయాంలో అవన్నీ నిర్వీర్యమయ్యాయి. అయితే.. ప్రస్తుత వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో ముస్లింల అభివృద్ధికి విశేషమైన కృషి జరుగుతోందన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఎండీ ఫరూఖ్ మాట్లాడుతూ.. 'పేద మహిళలు, యువత కోసం ప్రత్యేకంగా కంప్యూటర్ సెంటర్లు, టైలరింగ్ శిక్షణ కేంద్రాలు ప్రారంభించాం. వీటి ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. నెల్లూరులో ముస్లిం పిల్లల కోసం ప్రత్యేకంగా కార్పొరేట్ స్థాయి పాఠశాల ఏర్పాటు చేస్తున్నాం. డీఎస్సీ పరీక్షల్లో 11 శాతం మంది ముస్లిం యువత ఉద్యోగాలు సాధించారు. మంత్రి లోకేశ్ చొరవతో ఇంటర్మీడియట్ స్థాయిలోనూ మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయడం వల్ల విద్యార్థుల హాజరు శాతం గణనీయంగా పెరిగింది. పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన 500 మంది పేద ముస్లిం విద్యార్థులకు ప్రతిష్ఠాత్మక రెసిడెన్షియల్ కళాశాలల్లో ప్రవేశాలు కల్పిస్తున్నారు. వారి ఖర్చులను వక్ఫ్‌బోర్డే పూర్తిగా భరించనుంది.

## డ్రగ్స్ నిర్మూలనకు ఉమ్మడి కృషి

సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేశ్ బి. గితే పిలుపు

సిరిసిల్ల,మే2 డ్రగ్స్ మహమ్మారిని నిర్మూలించి భావితరాలకు మంచి భవిష్యత్తు అందిద్దామని సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేశ్ బి. గితే పిలుపునిచ్చారు. డ్రగ్స్ రహిత తెలంగాణ వారోత్సవాల సందర్భంగా శనివారం సిరిసిల్లలో నిర్వహించిన 2ఐ రన్‌లో విద్యార్థులు, క్రీడాకారులతో కలిసి పాల్గొన్నారు.

అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. డ్రగ్స్, గంజాయి నిర్ములన కోసం జరుగుతున్న పోరాటంలో ప్రతి పౌరుడూ బాధ్యతగల వారిగా వ్యవహరించి, డ్రగ్స్ రహిత తెలంగాణగా మార్చడంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి పక్కా ప్రణాళికతో చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు.

## అత్తను హతమార్చిన అల్లుడు

➢ మొదటి పేజి తరువాయి

మధ్య కూడా వాగ్వాదాలు జరుగుతున్నట్లు సమాచారం. ఘటనకు ముందు రోజు రాత్రి అల్లుడు స్నేహిత్ అత్త అరుణకు ఫోన్ చేసి తీవ్ర స్వరంతో మాట్లాడినట్లు తెలుస్తోంది. తన భార్య ప్రవర్తనపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ ఉద్రిక్తత తదుపరి రోజు దారుణానికి కారణమైంది.ఏప్రిల్ 30న మధ్యాహ్నం, దుకాణం నుంచి వస్తున్న అరుణను స్నేహిత్ తన బైక్‌పై ఎక్కించుకున్నాడు. మార్గమధ్యంలో గొడవ చెలరేగడంతో ఆగ్రహానికి లోనైన అతను హెల్మెట్‌తో అరుణ తలపై బలంగా కొట్టాడు. దీంతో ఆమె కిందపడిపోయి తీవ్రంగా గాయపడింది. తర్వాత ఘటనను ప్రమాదంగా చూపించేందుకు స్నేహిత్ ప్రయత్నించాడు. తన భార్యకు ఫోన్ చేసి అత్తకు అనారోగ్య సమస్య వచ్చి పడిపోయిందని చెప్పాడు. ఆసుపత్రికి తరలించినప్పటికీ అరుణ ప్రాణాలు నిలవలేదు. అయితే ఘటనపై అనుమానం వచ్చిన కుమార్తె కావ్య, సీసీ కెమెరా దృశ్యాలను పరిశీలించింది. అందులో నిజం బయటపడటంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టగా, ఈ దారుణ ఘటనకు సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

## పూణేలో చిన్నారిపై దారుణం..

## నిందితుడు అరెస్ట్

➢ మొదటి పేజి తరువాయి

తనతో తీసుకెళ్లాడు. అనంతరం సమీపంలోని పశువుల పాకలోకి తీసుకెళ్లి దారుణానికి పాల్పడ్డాడు. తర్వాత బాలికను హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. చిన్నారి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతూ గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు ప్రారంభమైంది. సమీపంలోని సీసీ కెమెరా దృశ్యాల్లో నిందితుడు చిన్నారిని తీసుకెళ్తున్నట్లు రికార్డు కావడంతో ఘటన వెలుగులోకి వచ్చింది.ఘటన అనంతరం నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. అయితే పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టి అతడిని అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం కేసును మరింతగా విచారిస్తున్నారు. ఈ ఘటనపై స్థానికులు తీవ్ర ఆందోళనకు దిగారు. బెంగళూరు--ముంబై జాతీయ రహదారిపై నిరసన వ్యక్తం చేస్తూ రాకపోకలను అడ్డుకున్నారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని, త్వరగా ఛార్జిషీట్ దాఖలు చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనల నేపథ్యంలో పోలీసులు, అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని నిరసనకారులతో చర్చలు జరిపారు. నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించింది. ఈ ఘటనపై ప్రతిపక్ష పార్టీలు కూడా తీవ్రంగా స్పందించగా, ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది.

## రైతు సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ విఫలం

### సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం

సిద్దిపేట,మే2 రైతన్నల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ సర్కార్ విఫలమైందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వం రుణమాఫీ చారాణ చేసి.. బారాణ ఎగ్గొట్టిందని ఎద్దేవా చేశారు. శనివారం కుకునూర్‌పల్లి మండల కేంద్రంలోని బీరప్ప ఆలయ వార్షికోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో హరీశ్‌రావు, బీఆర్ఎస్ నేత వంటేరు ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు. హరీశ్‌రావు సమక్షంలో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో పలువురు చేరారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ ఆశీస్సులతో సిద్దిపేట జిల్లాలో ఎక్కడలేని విధంగా బీరప్ప దేవాలయాన్ని అనాడు కేసీఆర్ చాలా చక్కగా నిర్మించారని తెలిపారు. ఒకప్పుడు గజ్వేల్‌లో మూగజీవాలకు నీరు, గ్రాసం దొరక్క జీవాలను మేపడానికి ఎక్కడికో వెళ్తుండేవారని.. కానీ కొండపోచమ్మ , మల్లన్నసాగర్ ప్రాజెక్టుతో నీరు, గ్రాసం కోసం వేరేవాళ్లు ఇప్పుడు మన దగ్గరకు వస్తున్నారని చెప్పుకొచ్చారు. జీవాలకు నట్టల మందు కూడా ఇవ్వడం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి చేతకావట్లేదని సెటైర్లు గుప్పించారు. బీఆర్ఎస్ హయాంలో భూముల ధరలకు రెక్కలు రాగా.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక భూములను కోనేవారు, చూసేవారు లేరని హరీశ్‌రావు విమర్శించారు.

## ఓట్ల లెక్కింపులో ఇసి మరో కీలక నిర్ణయం

అదనపు పరిశీలకులను నియిమస్తూ ఆదేశాలు

కోల్‌కతా,మే2 ఓట్ల లెక్కింపు తేదీ సమీపిస్తున్న వేళ పశ్చిమ బెంగాల్‌లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఎన్నికల సంఘం అదనపు పరిశీలకులను మోహరించింది. ఒకటి కంటే ఎక్కువ కౌంటింగ్ హాళ్లు ఉన్న నియోజకవర్గాల్లో మొత్తం 165 మంది ఎన్నికల, 77 మంది పోలీసులను పరిశీలకులుగా నియమించింది. ఓట్ల లెక్కింపు పక్రియ సురక్షితంగా, పారదర్శకంగా సాగేందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు వెల్లడించింది. కౌంటింగ్ కేంద్రాల పరిసరాల్లో శాంతిభద్రతల ఏర్పాట్లను పోలీసు పరిశీలకులు పర్యవేక్షిస్తారని తెలిపింది. ఈసీఐనెట్ ద్వారా జారీ చేసిన క్యూఆర్ కోడ్ ఆధారిత ఫొటో గుర్తింపు కార్డు కలిగి ఉన్నవారిని మాత్రమే కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతించనున్నట్లు పేర్కొంది. దక్షిణ 24 పరగణాల జిల్లాలో రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 15 పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ కొనసాగుతోంది. సాయంత్రం 5 గంటల సమయానికి 86 శాతానికి పైగా పోలింగ్ నమోదైంది. మరోవైపు ఓట్ల లెక్కింపు తర్వాత తమకు భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఇదే జిల్లాలోని ఫల్తాలో వందలాది మంది నిరసన చేపట్టారు. ఈ ప్రాంతంలోని టీఎంసీ కార్యకర్తల నుంచి తమకు ప్రాణ హాని ఉందన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత తమపై దాడులు చేస్తామని వారు బెదిరించారని ఆరోపించారు.

## ఇరాన్ ప్రతిపాదనలు నచ్చలేదు

### మరోమారు మెలిక పెట్టిన ట్రంప్

వాషింగ్టన్,మే2( పశ్చిమాసియాలో కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగుతున్నప్పటికీ శాంతి చర్చల విషయంలో మాత్రం పూర్తి స్పష్టత రావడం లేదు. అమెరికా, ఇరాన్‌ల మధ్య ఒప్పందం విషయంలో విభేదాలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా పాకిస్థాన్ ద్వారా ఇరాన్ పంపించిన ప్రతిపాదన తనకు నచ్చలేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఒకవేళ ఒప్పందం కుదరకపోతే ఇరాన్‌పై సైనిక చర్యకు దిగే అవకాశం ఉందని హెచ్చరించారు. 'ఇరాన్ ప్రతిపాదన అంగీకరించదగిన స్థాయిలో లేదు. ఒప్పందం సాధ్యమవుతుందో లేదో చెప్పడం కష్టం' అని ట్రంప్ తాజాగా పేర్కొన్నారు. దీంతో ఇరాన్-అమెరికా మధ్య చర్చలు ఇంకా అనిశ్చితిలోనే ఉన్నట్టు అర్థమవుతోంది. తమ దేశంపై ఆర్థిక ఆంక్షలు ఎత్తివేయాలని, నౌకా దిగ్బంధనం తొలగించాలని ఇరాన్ అడుగుతోంది.

## మృత్యు ఒడిలోనూ వీడని మాతృత్వం



జరిగిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై పర్యాటక శాఖ ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించింది. ప్రధాని నరేంద్ర మోదీ ఈ దుర్ఘటనపై తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ?2 లక్షలు, గాయపడిన వారికి ?50,000 చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. పర్యాటక ప్రదేశాల్లో భద్రతా ప్రమాణాలు పాటించకపోతే ఇలాంటి ప్రాణనష్టం తప్పదని ఈ ఘటన మరోసారి హెచ్చరించింది. అధికారులు ప్రస్తుతం నదిలో ఇంకా ఎవరైనా చిక్కుకున్నారా అనే కోణంలో గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. బాధిత కుటుంబాలకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందించాలని స్థానిక యంత్రాంగాన్ని ప్రభుత్వం ఆదేశించింది. ప్రకృతి వైపరీత్యాల ముందు మనిషి ప్రాణం తృణప్రాయంగా మారుతోంది. పర్యాటక ప్రాంతాలకు వెళ్లే ప్రజలు కూడా తమ భద్రత పట్ల అవగాహన కలిగి ఉండాలి. ముఖ్యంగా బోటు ప్రయాణాల్లో లైఫ్ జాకెట్లు ధరించడం తప్పనిసరి చేయాలి. బాధ్యతాయుతమైన పర్యాటక రంగం ఉన్నప్పుడే ఇలాంటి విషాదాలు పునరావృతం కాకుండా ఉంటాయి. మరణించినా బిడ్డను వీడని ఆ తల్లి ప్రేమ అందరినీ కలచివేస్తోంది. ఇలాంటి ఘటనలు జరగకుండా ఉండటమే ఆ తల్లికి మనం ఇచ్చే అసలైన నివాళి. సామాన్య పౌరుల ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది.

## పీఆర్సీపై కీలక నిర్ణయాలకు రంగం సిద్ధం

పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు చెప్పారు. నిధుల వినియోగంలో ప్రాధాన్యతలను నిర్ణయించడంలో ఉద్యోగ సంఘాలు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సీఎం సూచించారు. ప్రభుత్వం, ఉద్యోగ సంఘాలు పరస్పర సహకారంతో ముందుకు సాగితేనే సమస్యలకు శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.ఉద్యోగ సంఘాలు ప్రతి రెండు నెలలకు ఒకసారి సమావేశమై సమస్యలను గుర్తించి ప్రభుత్వానికి నివేదిక అందించాలని సూచించారు. ఇది స్నేహపూర్వక ప్రభుత్వం అని, ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు. ఉద్యోగుల ఆరోగ్య భద్రతపై ప్రత్యేకంగా దృష్టి సారించిన ప్రభుత్వం, జూన్ 1లోగా హెల్త్ కార్డులను అందజేస్తామని హామీ ఇచ్చింది. ఉద్యోగులు ప్రభుత్వ పథకాల అమలులో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి కృషి వల్లే సంక్షేమ కార్యక్రమాలు విజయవంతంగా ప్రజలకు చేరుతున్నాయని సీఎం ప్రశంసించారు.ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగుల కోసం తీసుకున్న నిర్ణయాలను సీఎం వివరించారు. ప్రతి నెలా మొదటి తేదీన వేతనాలు అందేలా చర్యలు తీసుకున్నామని, బదిలీల వ్యవస్థను పారదర్శకంగా నిర్వహించామని చెప్పారు. ముఖ్యంగా టీచర్ల బదిలీల వంటి కీలక అంశాలను ఎలాంటి వివాదం లేకుండా పూర్తి చేసినట్లు తెలిపారు. గత రెండేళ్లలో 67,760 ఉద్యోగ నియామకాలు చేపట్టడం ద్వారా నిరుద్యోగ సమస్యను తగ్గించే దిశగా ప్రభుత్వం కృషి చేసిందని సీఎం పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఉద్యోగావకాశాలను పెంచే చర్యలు కొనసాగుతాయని చెప్పారు.ఈ సమావేశంలో ఉద్యోగ సంఘాల నాయకులు ప్రస్తావించిన పలు డిమాండ్లపై సీఎం సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై సంతృప్తి వ్యక్తం చేసిన ఉద్యోగ సంఘాలు, ఈ నెల 5న చేపట్టాల్సిన నిరసన కార్యక్రమాలను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించాయి. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సానుకూల ఫలితాలను ఇస్తున్నాయని నాయకులు తెలిపారు. సీఎం నేతృత్వంలో ప్రభుత్వం ఉద్యోగులకు మద్దతుగా నిలుస్తోందని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో ఉద్యోగుల పాత్ర కీలకమని సీఎం మరోసారి స్పష్టం చేశారు. ప్రభుత్వం, ఉద్యోగులు కలిసి పనిచేస్తేనే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలమని పేర్కొన్నారు.

## గ్యాస్ ధరల పెంపుపై షర్మిల తీవ్ర విమర్శలు


రాష్ట్రాల ఎన్నికలు పూర్తైన వెంటనే ధరల పెంపు నిర్ణయం తీసుకోవడం ప్రజలకు ఇచ్చిన 'గిఫ్ట్' అని షర్మిల ఎద్దేవా చేశారు. వాణిజ్య గ్యాస్ సిలిండర్‌పై ఒకేసారి భారీగా పెంపు చేయడం, 5 కిలోల సిలిండర్ ధరను కూడా పెంచడం ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు. గత ఆరు నెలల్లోనే ధరలు గణనీయంగా పెరిగాయని, ఈ ఏడాదిలోనే దాదాపు 80 శాతం పెరుగుదల నమోదైందని షర్మిల ఆరోపించారు. ఈ తరహా పెంపు దేశ చరిత్రలో అరుదైనదని పేర్కొంటూ, దీనిపై వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు.ఈ ధరల పెంపు సామాన్య ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. టీ దుకాణాలు, చిన్న హోటళ్లు నడిపే వ్యాపారులు తీవ్రంగా ప్రభావితమవుతున్నారని చెప్పారు. బయట ఆహారం తీసుకునే విద్యార్థులు, వలస కార్మికులపై ఇది అదనపు భారంగా మారిందని పేర్కొన్నారు. చమురు ధరలు తక్కువగా ఉన్నప్పుడు లాభాలు పొందిన కేంద్ర ప్రభుత్వం, ఇప్పుడు ధరలు పెరిగాయని చెప్పి ప్రజలపై భారం మోపడం సమంజసం కాదని ఆమె ప్రశ్నించారు. ప్రజల ప్రయోజనాలకన్నా ఆదాయంపై దృష్టి పెట్టడం తప్పని విమర్శించారు. పెంచిన గ్యాస్ ధరలను తక్షణం ఉపసంహరించుకోవాలని షర్మిల డిమాండ్ చేశారు. ప్రజలపై భారాన్ని తగ్గించే దిశగా కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ తరపున విజ్ఞప్తి చేశారు.

## బీమా రంగంలో వందశాతం విదేశీప్రత్యక్ష పెట్టుబడులు

ఈ పెట్టుబడులకు ఐఆర్‌డీఏ అనుమతులు అవసరమని కూడా ఆర్థిక శాఖ తన ప్రకటనలో తెలిపింది. బీమా కంపెనీల్లో ఆటోమేటిక్ రూట్‌లో విదేశీ పెట్టుబడులను 74 శాతం నుంచి 100 శాతానికి పెంచుతూ పార్లమెంటు గతేడాది కొత్త బిల్లును ఆమోదించిన విషయం తెలిసిందే. సబ్కా బీమా సబ్కీ రక్షా బిల్లు పేరిట ఇన్సూరెన్స్ చట్టంలో సవరణలకు పార్లమెంటు ఆమోదం తెలిపింది. బిల్లుపై చర్చ సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ బిల్లుతో ఇన్సూరెన్స్ రంగంలోకి మరిన్ని పెట్టుబడులు వస్తాయని అన్నారు. దేశ నలుమూలలకూ ఇన్సూరెన్స్ సేవలు విస్తరిస్తాయని చెప్పారు. ఇప్పటికే విదేశీ పెట్టుబడులకు మార్గాలు ఉన్నప్పటికీ చేయాల్సింది ఇంకా ఎంతో ఉందని కూడా ఆర్థిక మంత్రి అభిప్రాయపడ్డారు. వివిధ కారణాలతో భారత్‌లో భాగస్వామ్య కంపెనీలు లభించక మిన్నకుండి పోయిన విదేశీ కంపెనీలు దేశంలోకి వస్తాయని చెప్పారు. ఇది అంతిమంగా వినియోగదారులకు లాభం చేకూరుస్తుందని మంత్రి అన్నారు. ఈ రంగంలో పోటీ పెరిగి యూజర్లకు ఇన్సూరెన్స్ ప్రీమియంల భారం తగ్గుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

THARANGALU DAILY NEWS
ఆదివారం, 03 మే, 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

## వివాహ శుభ కార్యక్రమశీలో పాల్గొన్న మల్లి బాబు యాదవ్



**ఇల్లందు ప్రతినిధి మే 2, ( తరంగాలు):** కామేపల్లి మండలం బండిపాడు గ్రామానికి చెందిన జాటోత్ భద్రాజీ -రంగమ్మ ల దంపతుల కుమారుడు ప్రసాద్ -మౌనిక అలాగే అదే గ్రామానికి చెందిన గుగులోత్ బాబురావు -కైక దంపతుల కుమార్తె వివాహానికి మాజీ జెడ్పిటిసి మేకల మల్లి బాబు యాదవ్, మాజీ పి. ఏ. సి. ఎస్ అధ్యక్షులు ధనియాకుల హనుమంతరావు వివాహ శుభ కార్యక్రమాల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో రుక్మితండా సర్పంచ్ గుగులోత్ రమాదేవి, గుగులోత్ రవి, మాజీ ఉపసర్పంచ్ కొమ్మినేని శ్రీనివాసరావు, మేకల మల్లిఖార్జునరావు, జాటోత్ రామా,జాటోత్ భద్రాజీ, రంగమ్మ, గుగులోత్ కిషన్, కురసం రవి, జాటోత్ భాస్కర్ రావు, జాటోత్ మంగుతు,జాటోత్ హరికిషన్, గుగులోత్ శ్రీనివాస్, గుగులోత్ సక్రామ్, పరిగల లింగం, కురసం శోభన్ బాబు, గుగులోత్ దేవుసింగ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లందు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా బాధ్యతలు స్వీకరించిన - స్వరూప కాటం



**ఇల్లందు ప్రతినిధి మే 2, ( తరంగాలు):** ఇల్లందు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి గా కాటం స్వరూప ఈరోజు ఉదయం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ బి. రవికుమార్ వద్ద నుండి బాధ్యతలు స్వీకరించారు.వారికి ఇల్లందు బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి. రవికుమార్ నాయక్,కార్యవర్గ సభ్యులు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం వారు మాట్లాడుతూ, బార్ అండ్ బెంచ్ పరస్పరం సహకారంతో కక్షిదారులకు న్యాయ సేవలు అందించాలని తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జడ్జి గారితో పాటు ఇల్లందు బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి. రవికుమార్ నాయక్, కార్యవర్గ సభ్యులు సీనియర్ న్యాయవాదులు, జూనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ అవార్డును అందుకున్న మీడియం దుర్గయ్య -

### డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అవార్డును అందజేసిన మానవ హక్కుల సంఘం




**ఇల్లందు ప్రతినిధి మే 2, ( తరంగాలు)**: హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ సోషల్ సర్వీస్ ఫర్ చేంజ్ ఆఫ్ ఇండియా మహబూబాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన, మహనీయుల జయంతి సందర్భంగా జ్ఞాన సూర్యుడు అంబేద్కర్ అవార్డు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎక్సైజ్ ఎస్పి రవి కిరణ్,టీఎస్ఎఫ్ డాక్టర్ వివేక్,జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మంగళ పెల్లి హుస్సేన్,లీగల్ అడ్వైజర్ బట్టు శ్రీనివాసు టీం సభ్యులు కలిసి జెండా ఆవిష్కరణ అనంతరం వివిధ సంఘ నాయకులు మాట్లాడడం జరిగింది. గత కొద్ది సంవత్సరాలుగా ముఖ్యపాత్ర వహిస్తూ వివిధ సంఘ నాయకులకు, వివిధ అభివృద్ధి సేవా కార్యక్రమాలు చేసిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ఎన్ హెచ్ ఆర్ ఎస్ జె ఎస్ ఎస్ రాష్ట్ర విద్యా శాఖ సెక్రటరీ మీడియం దుర్గయ్య కి ఈ అవార్డ్స్ ఇవ్వడం జరిగిందని మంగళ పెల్లి హుస్సేన్ తెలిపారు.

## రాత్రి పూట కాఫీ తాగితే నిద్రకే కాదు.. ఈ విషయాల్లోనూ సమస్యలే వస్తాయి

జశీటటవవ । చాలా మంది కాఫీని ఇష్టంగా తాగుతూ ఉంటారు. పగటి పూట మాత్రమే కాకుండా రాత్రి కూడా కాఫీని తాగుతూ ఉంటారు. ఇలా రాత్రి సమయంలో కాఫీ తాగడం వల్ల నిద్ర భంగం అవుతుందన్న సంగతి అందరికీ చాలాకాలంగా తెలిసిందే. అయితే తాజా పరిశోధన ప్రకారం, ఇది కేవలం నిద్రపై ప్రభావం చూపడమే కాకుండా ప్రవర్తనపై కూడా ప్రభావం చూపిస్తుందని వెల్లడైంది. ముఖ్యంగా మహిళల్లో ఆత్రుత ), ప్రమాదకర నిర్ణయాల వైపు మొగ్గు చూపే అవకాశముందని అధ్యయనం చెబుతోంది. కాఫీలో ఉండే కెఫీన్ శక్తివంతమైన ఉద్దీపక పదార్థం. ఇది మెదడులో నిద్రను ప్రోత్సహించే అడెనోసిన్ అనే రసాయనాన్ని నిరోధించి మేల్కొలుపును పెంచుతుంది. అందుకే రాత్రివేళ కాఫీ తాగితే నిద్రపోవడం కష్టమవుతుంది.

### ఆలోచించకుండా స్పందించే అవకాశం..

కానీ తాజా పరిశోధనలు ఈ ప్రభావం నిద్రకే పరిమితం కాదని సూచిస్తున్నాయి. ఈ అధ్యయనం ప్రకారం, రాత్రి సమయంలో కెఫీన్ తీసుకున్నప్పుడు ప్రవర్తన నియంత్రణ తగ్గే అవకాశం ఉంటుందని తేలింది. పరిశోధకులు ఫ్రూట్ ఫ్లైస్‌పై చేసిన పరీక్షల్లో, రాత్రివేళ కెఫీన్ తీసుకున్న వాటిలో ఆలోచించకుండా స్పందించే స్వభావం ఎక్కువగా కనిపించినట్లు గుర్తించారు. అవి ప్రతికూల పరిస్థితుల్లో కూడా తమ చర్యలను నియంత్రించలేకపోయినట్లు గమనించారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఇదే ప్రభావం పగటిపూట కెఫీన్ తీసుకున్నప్పుడు కనిపించలేదు. అంటే కాఫీ తాగే సమయం చాలా కీలకమని ఈ అధ్యయనం స్పష్టం చేసింది.

# మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమం



**జఫర్‌గడ్ ప్రతినిధి, మే 2,(తరంగాలు):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక -- 99 రోజుల కార్యక్రమంలో భాగంగా "చైల్డ్ సేఫ్టీ అండ్ ప్రొటెక్షన్ సే నో టు డ్రగ్స్ వీక్" చివరి రోజు సందర్భంగా ప్రజాధరణ సోషల్ వెల్ఫేర్ సొసైటీ చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్, జఫర్‌గడ్‌లో మహిళలు ,పిల్లల సంక్షేమ శాఖ పోలీస్ శాఖ సంయుక్తంగా మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జనగాం డిసిపి రాజమహేంద్ర నాయక్ జిల్లా సంక్షేమ అధికారి కోదండరాములు హాజరయ్యారు. ఈ సందర్భంగా డిసిపి మాట్లాడుతూ పిల్లలందరికీ జీవితంలో ఒక స్పష్టమైన లక్ష్యం ఉండాలని, కష్టపడి చదివి లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. మత్తు పదార్థాలు జీవితాన్ని నాశనం చేస్తాయని, తెలియని వ్యక్తులు చాక్లెట్లు లేదా తినుబండారాల రూపంలో మత్తు పదార్థాలు ఇవ్వవచ్చని, అలాంటి వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ తీసుకోకూడదని హెచ్చరించారు. తెలియని వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అలాగే ఎక్కడైనా మాదకద్రవ్యాల విక్రయం జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే 100, 1098 (చైల్డ్ హెల్ప్ లైన్) మరియు 1908 (డ్రగ్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. డి డబ్ల్యూ ఓ కోదండరాములు మాట్లాడుతూ మత్తు పదార్థాల వాడకం వల్ల శారీరక, మానసిక మరియు సామాజిక సమస్యలు కలుగుతాయని, పిల్లలు మంచి అలవాట్లు అలవరచుకొని దూరంగా ఉండాలని తెలిపారు. అనంతరం చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్‌లోని బాలబాలికలకు స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేయబడింది. పిల్లలు క్రీడల్లో పాల్గొని ఆరోగ్యంగా ఉండాలని అధికారులు ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఏసీపీ అంబటి నరసయ్య , సిఐ శ్రీనివాసరావు , జాఫర్‌గడ్ ఎస్సై రామారావు , ఈగల్ ( నార్కోటిక్) ఎస్సై కుమారస్వామి , జిల్లా బాలల పరిరక్షణ అధికారి రవికాంత్ , పి ఓ ఐ సి స్వప్నరాణి , చైల్డ్ హెల్ప్ లైన్ కౌన్సిలర్ మమత గారు, ప్రజాధరణ ఆశ్రమం ఇన్చార్జిలు పూజ, శ్రీధర్ గారు, విద్యార్థినీ విద్యార్థులు మరియు పోలీస్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.




## రైతులకు మద్దతు ధర కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం



- వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం
- ఏఎంసి వైస్ చైర్మన్ - శాఖమూరి హరిబాబు

**తరంగాలు, మే :02, నర్సంపేట నియోజకవర్గ ప్రతినిధి**

నర్సంపేట నియోజకవర్గం ఖానాపురం మండలం పరిధిలో రైతులు యాసంగి సీజన్లో పండించిన వరి ధాన్యం చివరి గింజ వరకు ప్రభుత్వ మద్దతు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్ద కొనుగోలు చేస్తామని నర్సంపేట వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు మండల రైతులకు తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని ఐదు కొనుగోలు కేంద్రాలు మంగళవారిపేట, బుధరావుపేట, ధర్మారావుపేట, ఖానాపురం 1,2 కేంద్రాలను మార్కెట్ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రైతులు పండించిన వరి ధాన్యంలో తాలు, పొల్లు, మట్టి గడ్డలు లేకుండా శుభ్రం చేసుకుని కేంద్రాలకు తీసుకురావాలని రైతులకు తెలిపారు. కొనుగోలు కేంద్రాలలోనే రైతులకు మద్దతు ధర ఏ గ్రేడ్ 2389, సీ 2369 రూపాయలు ప్రభుత్వం మద్దతు ధర రైతులకు చెల్లిస్తుందని రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు యడ్ల జగన్మోహన్ రెడ్డి, నర్సంపేట డివిజన్ ఆత్మ చైర్మన్ యడ్ల బిక్షం రెడ్డి, మండల మైనార్టీ అధ్యక్షుడు ఎస్.కె ముస్తఫా, మాజీ సర్పంచ్ పరుచూరి సుబ్బారావు, మండవ శివ ప్రసాదరావు, సొసైటీ సీఈవో ఆంజనేయులు, సహకార సంఘం సిబ్బంది రాజు, వినయ్, వీరేష్, భీమయ్య, మండల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## ఉచిత కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి





### టీఎంఎస్ ఫౌండర్ చైర్మన్ అవార్డు గ్రహీత దొనికెన పద్మ

**హైదరాబాద్, మే 2,తరంగాలు** : మహిళలు ఉచిత కుట్టు మిషన్ శిక్షణను సద్వినియోగం చేసుకొని ఉపాధి అవకాశాలను పొందాలని టీఎంఎస్ ఫౌండర్ చైర్మన్ అవార్డు గ్రహీత దొనికెన పద్మ అన్నారు. ఇస్నాపూర్ మున్సిపాలిటీ కేంద్రంలోని సేయింట్ మేరీస్ గ్రామర్ హై స్కూల్లో ఆమె శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా దొనికెన పద్మ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడానికి ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ శిక్షణ ద్వారా మహిళలకు టైలరింగ్,బ్యూటీషియన్, బేసిక్ కంప్యూటర్ కోర్సులలో ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు ఇవ్వడంతో పాటు ఉపాధి అవకాశాలు కూడా కల్పించడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు ఈ కింది నెంబర్ (9502038615) ను సంప్రదించగలరు.



జాతీయ దిన పత్రిక
తరంగాలు
THARANGALU DAILY NEWS
ఆదివారం, 03 మే , 2026


## గ్యాస్ మాఫియా బట్టబయలు చేసిన తండ్రీకొడుకులకు సీపీ సజ్జనర్ సత్కారం

- ప్రశంసాపత్రం, నగదు బహుమతితో గౌరవం
- అక్రమ రీఫిల్లింగ్ దందాపై పోలీసులు కేసులు
- పౌర చైతన్యంతో నేరాల అరికట్టే సందేశం




**హైదరాబాద్, మే 02 ( తరంగాలు) (ప్రతినిధి):** గ్యాస్ సిలిండర్ల సరఫరాలో జరుగుతున్న అక్రమాలను వెలికితీసిన తండ్రీకొడుకులను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ ఘనంగా సత్కరించారు. బంజారాహిల్స్‌లోని టీజీఐసీసీసీలో జరిగిన కార్యక్రమంలో వారికి ప్రశంసాపత్రం, నగదు రివార్డు అందజేశారు. చూడీబజార్‌కు చెందిన వ్యాపారి అశోక్ తివారీ, ఆయన కుమారుడు నమాన్ తివారీ గ్యాస్ సిలిండర్ డెలివరీ సమయంలో బరువు తక్కువగా ఉండటాన్ని గుర్తించారు. నిబంధనల ప్రకారం 30.4 కిలోలు ఉండాల్సిన సిలిండర్ కేవలం 28 కిలోలే ఉన్నట్లు తేలడంతో అనుమానం వ్యక్తం చేశారు. గతంలో కూడా ఇలాంటి సంఘటనలు జరగడంతో మరింత పరిశీలించారు.సంబంధిత గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులను ప్రశ్నించగా సరైన సమాధానం రాకపోవడంతో తండ్రీకొడుకులు స్వయంగా విచారణ చేపట్టారు. ఈ క్రమంలో జుమేరాత్ బజార్ పరిధిలో అక్రమంగా గ్యాస్ రీఫిల్లింగ్ జరుగుతున్నట్లు గుర్తించారు. చిన్న సిలిండర్లలోకి గ్యాస్ నింపుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని గుర్తించారు. దీంతో గోషామహల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సిద్దార్థ ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన ఐదుగురిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి కమర్షియల్, డొమెస్టిక్, చిన్న సిలిండర్లు, రీఫిల్లింగ్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా సీపీ సజ్జనర్ మాట్లాడుతూ పౌర బాధ్యతతో వ్యవహరించి అక్రమాలను వెలుగులోకి తెచ్చిన ఈ తండ్రీకొడుకులు ప్రతి ఒక్కరికీ ఆదర్శమని ప్రశంసించారు. యూనిఫాం లేకపోయినా పోలీసుల్లా వ్యవహరించి సమాజానికి మేలు చేశారని కొనియాడారు. ప్రతి పౌరుడు ఇలాగే అప్రమత్తంగా ఉంటే నేరాలు తగ్గుతాయని ఆయన అన్నారు. వినియోగదారులు కూడా తమకు అందే వస్తువుల నాణ్యత, పరిమాణంపై నిఘా ఉంచాలని సూచించారు. ఎక్కడైనా మోసం గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.అక్రమ గ్యాస్ రీఫిల్లింగ్ కార్యకలాపాలపై హైదరాబాద్ పోలీసులు కఠిన చర్యలు కొనసాగిస్తారని సీపీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఇంటర్ సప్లిమెంటరీ ఫీజు గడువు పొడిగింపు

- మరో రెండు రోజులు విద్యార్థులకు అవకాశం
- ఆలస్య రుసుం రూ. 3 వేలతో చెల్లింపు




**హైదరాబాద్, మే 02 ( తరంగాలు (ప్రతినిధి):** రాష్ట్రంలోని ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన ఫీజు చెల్లింపు గడువును అధికారులు మరో రెండు రోజుల పాటు పొడిగించారు. ఇంటర్మీడియట్ బోర్డు ఈ నిర్ణయాన్ని ప్రకటించింది. ఈ మేరకు మే 2 నుంచి మే 4వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఫీజు చెల్లించుకునే అవకాశం కల్పించినట్లు అధికారులు తెలిపారు. గడువు ముగిసేలోపు విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఆలస్య రుసుం రూ. 3 వేలతో పరీక్ష ఫీజు చెల్లించవచ్చని వెల్లడించారు. రెగ్యులర్ విద్యార్థులతో పాటు ఫెయిలైన వారు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని పేర్కొన్నారు.విద్యార్థులు చివరి నిమిషంలో ఇబ్బందులు పడకుండా ముందుగానే ఫీజు చెల్లించుకోవాలని అధికారులు సూచించారు. ఆన్‌లైన్ ద్వారా సులభంగా ఫీజు చెల్లించే సదుపాయం అందుబాటులో ఉందని తెలిపారు. సప్లిమెంటరీ పరీక్షలు రాయదలచిన వారు తప్పకుండా ఈ గడువులో ఫీజు చెల్లించుకోవాలని హెచ్చరించారు. గడువు ముగిసిన తర్వాత ఎలాంటి పొడిగింపు ఉండకపోవచ్చని స్పష్టం చేశారు. ఈ నిర్ణయం ద్వారా ఎక్కువ మంది విద్యార్థులకు మరో అవకాశం లభించిందని అధికారులు పేర్కొన్నారు. పరీక్షలకు సిద్ధమవుతూ ఫీజు చెల్లింపును నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు.

## రెండు వారాల పాటు మైదాను తినడం మానేస్తే శరీరంలో జరిగే మార్పులు ఇవే

మనకు తెలియకుండానే రోజువారీ ఆహారంలో భాగమైపోయిన పదార్థం. బ్రెడ్, బిస్కెట్లు, నూడుల్స్, కేకులు, పేస్ట్రీలు వంటి అనేక వంటకాలలో దీన్ని విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. రుచిగా ఉన్నప్పటికీ, ఇందులో పోషకాలు తక్కువగా ఉండటం, జీర్ణక్రియపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉండడంతో, ఆరోగ్య నిపుణులు దీనిని పరిమితం చేయాలని సూచిస్తున్నారు. అందుకే కొందరు కొంతకాలం మైదాను పూర్తిగా మానేసి శరీరంలో వచ్చే మార్పులను గమనిస్తున్నారు. కేవలం రెండు వారాల పాటు మైదా తీసుకోకుండా ఉంటే కొన్ని స్పష్టమైన మార్పులు కనిపిస్తాయని నిపుణులు చెబుతున్నారు.

**జీర్ణ వ్యవస్థకు..**

మైదాను ఆహారం నుంచి తొలగించడంతో జీర్ణక్రియలో మెరుగుదల కనిపిస్తుంది. ఫైబర్ లేని మైదా జీర్ణక్రియను మందగింపజేస్తుంది.

# సిద్దిపేటలో హనుమాన్ సిద్ది మహా యాగం





- మాజీ మంత్రి హరీశ్ రావు పాల్గొని ఆధ్యాత్మిక సందేశం
- దుర్గాప్రసాద్ స్వామీజీ ఆధ్వర్యంలో విశిష్ట కార్యక్రమం
- భక్తి, ధైర్యానికి హనుమంతుడు ప్రేరణ అని హరీశ్ రావు

**సిద్దిపేట, మే 02( తరంగాలు): ప్రతినిధి):** సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన భవిష్యత్ బ్రహ్మ హనుమాన్ సిద్ది మహా యాగం కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు పాల్గొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిద్దిపేటలో ఆంజనేయ స్వామి మాలకు అంకురార్పణ జరిగిన విషయాన్ని గుర్తుచేశారు. హనుమాన్ పీఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామీజీ ఆధ్వర్యంలో ఇలాంటి మహా యాగం నిర్వహించడం సంతోషకరమని అన్నారు. సిద్దిపేటలో ఈ యాగం జరగడం ప్రాంతానికి గౌరవంగా నిలిచిందని పేర్కొన్నారు. ఈ యాగంలో సుందరకాండ యజ్ఞం, 72 గంటల పాటు అఖండ హనుమాన్ చాలీసా పారాయణం, లక్ష సార్లు పారాయణం వంటి విశిష్ట కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. హనుమాన్ భక్తుల రూపంలో హనుమంతుడిని విశ్వవ్యాప్తం చేయాలన్న స్వామీజీ లక్ష్యం అభినందనీయం అని కొనియాడారు.సిద్దిపేటలో ప్రతి సంవత్సరం హనుమాన్ మాలలు వేల సంఖ్యలో ధరించబడుతున్నాయని, దేశంలోనే అత్యధికంగా హనుమాన్ మాలలు ధరించే భక్తులు ఇక్కడ ఉన్నారని హరీశ్ రావు పేర్కొన్నారు. ఈ విజయానికి దుర్గాప్రసాద్ స్వామీజీ ఆశీస్సులు కారణమని అన్నారు. స్వామీజీ భక్తులకు సౌలభ్యం కల్పించేందుకు స్వయంగా సిద్దిపేటకు వచ్చి మాల ధారణ కార్యక్రమం నిర్వహించడం గొప్ప విషయమని చెప్పారు. భక్తుల మాల విరమణను కూడా ఆయన చేతుల మీదుగా నిర్వహించడం ప్రత్యేకతగా నిలుస్తుందని వివరించారు. సిద్దిపేట మట్టికి ప్రత్యేకమైన మహత్యం ఉందని, ఇక్కడ ప్రారంభమైన కార్యక్రమాలు విజయవంతమవుతాయని హరీశ్ రావు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కూడా ఈ నేల నుంచి ప్రారంభమైందని గుర్తుచేశారు. దేశంలోని ప్రముఖ ఆలయాల్లో సిద్దిపేట భక్తులు సేవలందిస్తున్నారని, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆధ్యాత్మిక సేవలో ముందంజలో ఉన్నారని అన్నారు. భక్తితో హనుమంతుడిని స్మరిస్తే మనోధైర్యం పెరుగుతుందని, కష్టాలు దూరమవుతాయని పేర్కొన్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు మరింత విస్తరించాలని, సమాజానికి శాంతి, ధైర్యం అందించాలని హరీశ్ రావు ఆకాంక్షించారు.

# పవన్ కల్యాణ్‌ను పరామర్శించిన సీఎం చంద్రబాబు





- శస్త్రచికిత్స అనంతరం ఆరోగ్యంపై ఆరా
- జూబ్లీహిల్స్ నివాసంలో భేటీ
- రాష్ట్ర పరిస్థితులపై సంక్షిప్త చర్చ

**హైదరాబాద్, మే 02 తరంగాలు (ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ను శనివారం పరామర్శించారు. ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న పవన్ కల్యాణ్ హైదరాబాద్‌లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో సాయంత్రం జూబ్లీహిల్స్‌లోని పవన్ కల్యాణ్ నివాసానికి వెళ్లిన ముఖ్యమంత్రి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. శస్త్రచికిత్సకు సంబంధించిన వివరాలను ఆరా తీసి, పూర్తిగా కోలుకునే వరకు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రిని పవన్ కల్యాణ్, ఆయన భార్య అనా కొణిదెల సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు కొద్దిసేపు సమావేశమై రాష్ట్రంలోని తాజా పరిస్థితులపై చర్చించినట్లు సమాచారం. తన ఆరోగ్యం గురించి తెలుసుకునేందుకు స్వయంగా నివాసానికి వచ్చినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ భేటీ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇద్దరు నేతల మధ్య సమన్వయం కొనసాగుతుందనే సంకేతాలు ఇచ్చినట్లుగా భావిస్తున్నారు.

# వాట్సాప్‌లోనే ఆరోగ్య సేవలు

- ఏపీ ప్రభుత్వ కొత్త ముందడుగు
- 'మనమిత్ర' ద్వారా ఏఎంసీ సేవలు అందుబాటులోకి
- వైద్యులు, ప్రజలకు ఒకే వేదికపై సమాచార సౌకర్యం
- డిజిటల్ సేవల విస్తరణలో మరో కీలక నిర్ణయం

**అమరావతి, మే 02 ( తరంగాలు (ప్రతినిధి):** ప్రజలకు, వైద్యులకు ఆరోగ్య సేవలను మరింత సులభతరం చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. డిజిటల్ సేవల విస్తరణలో భాగంగా ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ సేవలను 'మనమిత్ర' వాట్సాప్ వేదిక ద్వారా అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇకపై ప్రజలు, వైద్యులు తమ మొబైల్ నుంచి 9552300009 నంబర్‌కు "హాయ్" లేదా »»Hiµ' అని సందేశం పంపి, తదనంతరం వచ్చే మెనూలో ఆరోగ్య శాఖ ఎంపికను ఎంచుకుని సేవలను పొందవచ్చు. ఈ విధానం ద్వారా ప్రభుత్వ సేవలు మరింత వేగంగా, సులభంగా అందుబాటులోకి రానున్నాయి. వైద్యులకు ఈ సేవలు మరింత ఉపయోగకరంగా మారనున్నాయి. తమ రిజిస్ట్రేషన్ వివరాలు, దరఖాస్తుల స్థితి, రాబోయే సీఎమ్ఈ కార్యక్రమాలు, క్రెడిట్ పాయింట్ల సమాచారాన్ని మొబైల్ ద్వారానే తెలుసుకునే అవకాశం కల్పించారు. సామాన్య ప్రజలకు కూడా ఈ సేవలు ఎంతో ఉపయోగపడనున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లోని ఓపీ సేవలు, బ్లడ్ బ్యాంకుల్లో రక్త లభ్యత, ఆసుపత్రుల్లో మందులు, శస్త్రచికిత్స సామగ్రి అందుబాటులో ఉందో లేదో సులభంగా తెలుసుకునే వీలు కల్పించారు. ఒకే వేదికపై వైద్యులు, రోగులకు అవసరమైన సమాచారాన్ని అందించడమే ఈ వ్యవస్థ లక్ష్యంగా ఉంది. అత్యవసర సమయాల్లో వేగంగా సమాచారం అందడం వల్ల ప్రాణాలను కాపాడే అవకాశాలు పెరుగుతాయని అధికారులు పేర్కొన్నారు. డిజిటల్ సేవల ద్వారా పౌరసేవలను మరింత చేరువ చేసే దిశగా ప్రభుత్వం వేస్తున్న ఈ అడుగు పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. భవిష్యత్తులో ఇలాంటి సేవలను మరింత విస్తరించే దిశగా చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

THARANGALU DAILY NEWS
ఆదివారం, 03 మే, 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

# హనుమకొండలో డ్రగ్స్ వ్యతిరేకంగా భారీ అవగాహన ర్యాలీ





- ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రత్యేక కార్యక్రమం
- కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఆధ్వర్యంలో ప్రారంభం
- యువత భవిష్యత్తు కోసం "సే నో టు డ్రగ్స్" సందేశం

**హనుమకొండ, మే 02 (తరంగాలు ప్రతినిధి):** హనుమకొండలో మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా "సే నో టు డ్రగ్స్" అంశంపై నిర్వహించిన ఈ భారీ ర్యాలీకి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. అదాలత్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు సాగిన ఈ ర్యాలీ నగరంలో చైతన్యాన్ని రేకెత్తించింది. ఈ ర్యాలీని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్, జిల్లా కలెక్టర్ ఛాహత్ బాజ్‌పాయ్ జెండా ఊపి ప్రారంభించారు.

ప్రారంభ కార్యక్రమంలోనే అధికారులు డ్రగ్స్ వల్ల కలిగే ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అత్యవసరతను ప్రస్తావించారు.

డ్రగ్స్ వినియోగం వ్యక్తిగత ఆరోగ్యాన్ని మాత్రమే కాదు, కుటుంబ వ్యవస్థను, సమాజ నిర్మాణాన్ని కూడా దెబ్బతీస్తుందని అధికారులు హెచ్చరించారు. ముఖ్యంగా యువత ఈ మాయలో పడకుండా జాగ్రత్త పడాలని, విద్య, క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాలపై దృష్టి సారించాలని సూచించారు. ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థలు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ నగర వీధుల్లో చైతన్యాన్ని కల్పించారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా మానవహారం నిర్వహించి, అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమం ద్వారా సమాజంలో బాధ్యతాయుతమైన ఆలోచనలను పెంపొందించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ డ్రగ్స్ సమస్యను కేవలం పోలీసులే కాదు, సమాజం మొత్తం కలిసి ఎదుర్కోవాలని పేర్కొన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేసి అవగాహన పెంచుతున్నామని తెలిపారు. కుటుంబ సభ్యులు కూడా పిల్లల ప్రవర్తనపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో డీసీపీ ధార కవిత, అడిషనల్ డీసీపీలు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఆశా వర్కర్లు, ఈగల్ టీం సభ్యులు కూడా చురుకుగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. డ్రగ్స్ నిర్మూలన కోసం ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని అధికారులు స్పష్టం చేశారు. ప్రజల భాగస్వామ్యంతోనే ఈ సమస్యను పూర్తిగా నివారించగలమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.

## సుప్రీంకోర్టులో మమతా బెనర్జీకి ఎదురుదెబ్బ

- ఓట్ల లెక్కింపుపై ఈసీ నిర్ణయానికి మద్దతు
- టీఎంసీ పిటిషన్‌ను తోసిపుచ్చిన ధర్మాసనం



**న్యూ ఢిల్లీ, మే 02 (తరంగాలు ప్రతినిధి):** పశ్చిమబెంగాల్‌లో ఓట్ల లెక్కింపు ప్రక్రియపై దాఖలైన పిటిషన్‌లో మమతా బెనర్జీకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఓట్ల లెక్కింపుకు సిబ్బందిని ఎంపిక చేసే విషయంలో ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయం సరైనదేనని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఓట్ల లెక్కింపుకు కేంద్ర ప్రభుత్వ సిబ్బందినే నియమించాలనే ఎన్నికల సంఘం సర్క్యులర్‌పై టీఎంసీ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ మొదట కలకత్తా హైకోర్టును ఆశ్రయించినా అక్కడ ఉపశమనం లభించలేదు. హైకోర్టు కూడా ఎన్నికల సంఘం నిర్ణయంలో ఎలాంటి తప్పు లేదని స్పష్టం చేసింది. దీనిపై అసంతృప్తితో సుప్రీంకోర్టును ఆశ్రయించిన మమతా బెనర్జీ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. ఏప్రిల్ 13న జారీ చేసిన సర్క్యులర్ వివరాలు ఆలస్యంగా తమకు తెలియజేయబడినట్లు ఆయన కోర్టుకు తెలిపారు. ఈ కేసును జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీల ధర్మాసనం విచారించింది. ఎన్నికల సంఘం తరఫున కౌంటింగ్ సిబ్బందిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు మిశ్రమంగా ఉంటారని, రిటర్నింగ్ అధికారిగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగి ఉంటాడని వివరించారు. సర్క్యులర్‌ను కచ్చితంగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. టీఎంసీ వ్యక్తం చేసిన అక్రమాల ఆందోళనలు ఆధారంలేనివని ఎన్నికల సంఘం వాదించింది. కౌంటింగ్ ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందని కోర్టుకు స్పష్టం చేసింది. వాదనలు పూర్తైన తరువాత ధర్మాసనం టీఎంసీ పిటిషన్‌ను తోసిపుచ్చింది. సర్క్యులర్ అమలు కావాలని కోరుకుంటూనే కోర్టుకు ఎందుకు వచ్చారని ప్రశ్నిస్తూ, ఇకపై ఈ అంశంపై తదుపరి ఆదేశాలు అవసరం లేదని స్పష్టం చేసింది.

## మండుటెండలకు ముగింపు సంకేతాలు

- ముందుగానే నైరుతి రుతుపవనాలు
- దేశవ్యాప్తంగా వర్షాల అంచనాలు

**అండమాన్ దీవులు, మే 02 (తరంగాలు ప్రతినిధి):** దేశాన్ని వేధిస్తున్న మండుటెండలకు



త్వరలోనే ఉపశమనం లభించే సూచనలు కనిపిస్తున్నాయి. భారత వాతావరణ విభాగం తాజా అంచనాల ప్రకారం నైరుతి రుతుపవనాలు ఈసారి సాధారణ సమయం కంటే ముందుగానే దేశంలో ప్రవేశించే అవకాశాలు ఉన్నాయని వెల్లడించింది. ఈ నెల 14 నుంచి 16 మధ్య నైరుతి రుతుపవనాలు అండమాన్ నికోబార్ దీవులను తాకే అవకాశముందని వాతావరణ నిపుణులు పేర్కొన్నారు. సాధారణంగా ఈ ప్రక్రియ కొంచెం ఆలస్యంగా ప్రారంభమవుతుండగా, ఈసారి ముందుగా రావడం గమనార్హంగా భావిస్తున్నారు. దీనివల్ల ఎండల తీవ్రత క్రమంగా తగ్గే అవకాశముందని అంచనా వేస్తున్నారు. రుతుపవనాలు ముందుగానే ప్రారంభమైతే దేశవ్యాప్తంగా సగటు వర్షపాతం సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలు, పశ్చిమ భారత ప్రాంతాల్లో అధిక వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని సూచించారు. ఇది వ్యవసాయ రంగానికి కొంత ఉపశమనం కలిగించే అంశంగా భావిస్తున్నారు. అయితే అన్ని ప్రాంతాల్లో సమానంగా వర్షాలు పడవని కూడా హెచ్చరించారు. ఈశాన్య ప్రాంతాలు, తూర్పు మధ్య భారతంలోని కొన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే సూచనలు ఉన్నాయని తెలిపారు. ఇది అక్కడి రైతులకు సవాలుగా మారే అవకాశముందని పేర్కొన్నారు. ఇక మే నెలలో వేడి ప్రభావం కొనసాగుతుందని కూడా స్పష్టం చేశారు. పగటిపూట మాత్రమే కాకుండా రాత్రిపూట కూడా ఉష్ణోగ్రతలు అధికంగా ఉండే అవకాశం ఉందని చెప్పారు. దీంతో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దక్షిణ ద్వీపకల్పంలోని కొన్ని ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిలో లేదా అంతకంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, పశ్చిమబెంగాల్ ప్రాంతాల్లో సముద్ర తేమతో కూడిన గాలుల వల్ల ఉక్కపోత అధికంగా ఉండే అవకాశం ఉందని వాతావరణ విభాగం వెల్లడించింది.

# ఆఫ్రికాలో భారత సైన్యం ప్రతిష్టాత్మక విన్యాసాలు ముగింపు





- ఫ్లింట్‌లాక్--2026లో భారత బలగాల సత్తా
- అంతర్జాతీయ భద్రతలో భాగస్వామ్యం బలోపేతం
- ఆఫ్రికా దేశాలతో సైనిక సహకారం విస్తరణ

**అబిడ్జాన్, మే 02 (తరంగాలు:** బహుళ దేశాల ప్రత్యేక దళాల సంయుక్త విన్యాసం 'ఫ్లింట్‌లాక్--2026' విజయవంతంగా ముగిసింది. ఈ విన్యాసాలు కోట్ దివ్వార్లో నిర్వహించబడగా, భారత సైన్యం కీలక పాత్ర పోషించింది. ఈ కార్యక్రమం ద్వారా ఆఫ్రికా దేశాలతో భారత రక్షణ సహకారం మరింత బలపడింది. ఈ విన్యాసాల్లో ప్రత్యేక ఆపరేషన్లపై విస్తృత శిక్షణలు నిర్వహించారు. వివిధ దేశాల సైన్యాలు కలిసి పనిచేస్తూ వ్యూహాత్మక నైపుణ్యాలను పరస్పరం పంచుకున్నాయి. ముఖ్యంగా గినియా దేశ సైనికులతో కలిసి భారత బలగాలు సంయుక్తంగా శిక్షణ పొందడం విశేషంగా నిలిచింది. ఇలాంటి విన్యాసాల ద్వారా సైన్యాల మధ్య సమన్వయం, పరస్పర నమ్మకం మరింత పెరుగుతుందని అధికారులు తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో ఉగ్రవాదం, భద్రతా సవాళ్లను ఎదుర్కొనేందుకు ఈ తరహా శిక్షణలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. భారత్ ఆఫ్రికా దేశాలతో రక్షణ రంగంలో భాగస్వామ్యాన్ని విస్తరించేందుకు కట్టుబడి ఉందని వెల్లడించింది. గ్లోబల్ భద్రతలో కీలక భాగస్వామిగా నిలవాలన్న లక్ష్యంతో ఈ చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు ఈ విన్యాసం ద్వారా భారత్--ఆఫ్రికా సంబంధాలు మరింత బలోపేతం అవుతున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సంయుక్త కార్యక్రమాలు కొనసాగనున్నాయి. ప్రపంచ భద్రత, శాంతి స్థాపనలో భారత సైన్యం తన పాత్రను మరింత విస్తరించేందుకు సిద్ధంగా ఉందని ఈ విన్యాసం మరోసారి నిరూపించింది.

# అద్దె ఇళ్ల మంట సామాన్యుడికి అందని 'సొంత గూడు' కల!

- ఆకాశాన్నంటుతున్న రియల్ ఎస్టేట్ ధరలు
- మధ్యతరగతిపై భారంగా మారిన అద్దెలు
- నియంత్రణ లేని డిపాజిట్లు, షరతులు

**డెస్క్, మే 02 తరంగాలు (ప్రతినిధి):** నగరాల్లో నివసించే మధ్యతరగతి, అల్ప ఆదాయ వర్గాలకు అద్దె ఇళ్ల సమస్య ఒక పీడకలగా మారుతోంది. రియల్ ఎస్టేట్ రంగంలో భూముల ధరలు, నిర్మాణ సామాగ్రి ఖర్చులు విపరీతంగా పెరగడం నేరుగా అద్దె ఇళ్లపై ప్రభావం చూపుతోంది. గతంలో అందుబాటులో ఉన్న అద్దెలు ఇప్పుడు రెట్టింపు కావడంతో సామాన్యులు తమ ఆదాయంలో సగానికి పైగా కేవలం ఇంటి అద్దెకే కేటాయించాల్సి వస్తోంది. సొంత గూడు నిర్మించుకోవడం తలకు మించిన భారంగా మారిన తరుణంలో, కనీసం అద్దె ఇంట్లోనైనా ప్రశాంతంగా ఉండలేని పరిస్థితి నెలకొంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా గృహాల లభ్యత లేకపోవడం డిమాండ్‌ను పెంచుతోంది. నగరాల్లోని ప్రధాన ప్రాంతాల్లో అద్దెలు ఆకాశాన్నంటుతుంటే, సామాన్యులు శివారు ప్రాంతాలకు వెళ్లక తప్పడం లేదు. అయితే అక్కడ కూడా రవాణా ఖర్చులు, సమయం వృధా కావడం మరో సమస్యగా మారుతోంది. రియల్ ఎస్టేట్ ధరల పెరుగుదలను ఆసరాగా చేసుకుని ఇంటి యజమానులు ఏటా అడ్డగోలుగా అద్దెలు పెంచుతున్నారు. అద్దె నియంత్రణ చట్టాలు క్షేత్రస్థాయిలో అమలు కాకపోవడం వల్ల



అద్దెదారులు ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. కేవలం అద్దె మాత్రమే కాకుండా అడ్వాన్స్ రూపంలో పెద్ద మొత్తంలో డబ్బు వసూలు చేయడం మరో ప్రధాన సమస్య. కొన్ని చోట్ల పది నెలల అద్దెను డిపాజిట్‌గా అడగడం పేద, మధ్యతరగతి వారికి పెను భారంగా మారుతోంది. దీనికి తోడు మెయింటెనెన్స్ ఖర్చులు, కరెంట్ బిల్లుల భారం అదనం. ఇంటి అద్దెకు దిగేటప్పుడు యజమానులు పెడుతున్న వింత షరతులు అద్దెదారుల స్వేచ్ఛను హరిస్తున్నాయి. బ్యాచిలర్లకు ఇళ్లు ఇవ్వకపోవడం, కొన్ని రకాల ఆహార నియమాలు పాటించాలని ఒత్తిడి చేయడం వంటివి సామాజిక వివక్షకు దారితీస్తున్నాయి. ఐటీ కంపెనీలు, పరిశ్రమలు ఉన్న ప్రాంతాల్లో అద్దెల పెరుగుదల మరింత ఎక్కువగా ఉంది. రియల్ ఎస్టేట్ వెంచర్లు వెలుస్తున్న ప్రతిచోటా కృత్రిమంగా ధరలను పెంచడం వల్ల సామాన్యులు ఆ ప్రాంతాల్లో నివసించే అవకాశాన్ని కోల్పోతున్నారు. ప్రభుత్వం గృహ నిర్మాణ రంగంలో జోక్యం చేసుకుని అద్దెదారుల రక్షణకు పటిష్టమైన చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఉంది. లేనిపక్షంలో భవిష్యత్తులో గూడు లేని జనాభా పెరిగిపోయే ప్రమాదం ఉంది. తక్కువ ధరలో అద్దె ఇళ్ల లభ్యతను పెంచడంపై దృష్టి సారించాల్సిన సమయం ఆసన్నమైంది. పెరిగిన రియల్ ఎస్టేట్ ధరలు కేవలం భూములకే పరిమితం కాకుండా సామాన్యుడి జీవనశైలిని దెబ్బతీస్తున్నాయి. అద్దె ఇళ్ల సమస్య పరిష్కారానికి ప్రభుత్వాలు రియల్ ఎస్టేట్ నియంత్రణ సంస్థల ద్వారా పర్యవేక్షణ పెంచాలి. అద్దె ఒప్పందాలు పారదర్శకంగా ఉండాలి. సామాన్యుడికి గూడు కల్పించడం అనేది వ్యాపారం కాకుండా ఒక సామాజిక బాధ్యతగా భావించాలి. అప్పుడే మధ్యతరగతి కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకోగలవు. అద్దె భారం తగ్గితేనే వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి.

## ఇరాన్ ప్రతిపాదనలు నచ్చలేదు

### మరోమారు మెలిక పెట్టిన ట్రంప్

వాషింగ్టన్,మే2 పశ్చిమాసియాలో కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగుతున్నప్పటికీ శాంతి చర్చల విషయంలో మాత్రం పూర్తి స్పష్టత రావడం లేదు. అమెరికా, ఇరాన్‌ల మధ్య ఒప్పందం విషయంలో విభేదాలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా పాకిస్థాన్ ద్వారా ఇరాన్ పంపించిన ప్రతిపాదన తనకు నచ్చలేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఒకవేళ ఒప్పందం కుదరకపోతే ఇరాన్‌పై సైనిక చర్యకు దిగే అవకాశం ఉందని హెచ్చరించారు. 'ఇరాన్ ప్రతిపాదన అంగీకరించదగిన స్థాయిలో లేదు. ఒప్పందం సాధ్యమవుతుందో లేదో చెప్పడం కష్టం' అని ట్రంప్ తాజాగా పేర్కొన్నారు. దీంతో ఇరాన్‌-అమెరికా మధ్య చర్చలు ఇంకా అనిశ్చితిలోనే ఉన్నట్టు అర్థమవుతోంది. తమ దేశంపై ఆర్థిక ఆంక్షలు ఎత్తివేయాలని, నౌకా దిగ్బంధనం తొలగించాలని ఇరాన్ అడుగుతోంది. అలాగే అణు కార్యక్రమం గురించి ఇప్పటికప్పుడు ఒక ఒప్పందానికి రాకూడదని భావిస్తోంది. అయితే అమెరికా మాత్రం తమ డిమాండ్లను నెరవేరిస్తేనే చర్చలపై ముందుకు వెళ్లాలని అనుకుంటోంది అణు కార్యక్రమం విషయంలో పూర్తి స్పష్టత కావాలని, అలాగే హోర్ముజ్ జలసంధిని పూర్తిగా తెరవాలని , అప్పటివరకు నౌకా దిగ్బంధన కొనసాగుతుందని అమెరికా స్పష్టం చేసింది.

## సంపాదకీయం

- మనిషిని మనిషిగా చూడలేని సమాజం
- కుల రహిత లోకం ఒక కలనా?
- మారుతున్న కాలం.. మారని మనస్తత్వాలు
- విద్యావంతుల్లోనూ పోని కుల జాడ్యం
- సమ సమాజం కోసం సాగాల్సిన పోరాటం



**డెస్క్, మే 2 (తరంగాలు ప్రతినిధి):** భారతీయ సామాజిక వ్యవస్థలో కులం అనేది ఒక విడదీయలేని అంశంగా మారిపోయింది. కొన్ని వేల ఏళ్ల క్రితం వృత్తి ప్రాతిపదికన ప్రారంభమైన ఈ విభజన కాలక్రమేణా పుట్టుకతో ముడిపడి విపరీత రూపం దాల్చింది. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా కుల వివక్ష అనే జాడ్యం సమాజం నుండి పూర్తిగా తొలగిపోలేదు. రాజ్యాంగం పౌరులందరికీ సమాన హక్కులు కల్పించినప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. మనిషిని మనిషిగా చూడలేని మానసిక స్థితి నుండి ఈ వివక్ష పుడుతోంది. ఒక వ్యక్తి సామర్థ్యాన్ని పక్కన పెట్టి కేవలం కులాన్ని బట్టి గౌరవించడం లేదా తక్కువ చేసి చూడటం నాగరిక సమాజానికి గొడ్డలి పెట్టు. కుల వివక్ష లేని సమాజం అనేది నేటికీ ఒక అందమైన కలగానే మిగిలిపోవడం విచారకరం.గ్రామీణ ప్రాంతాల్లో నేటికీ కొన్ని వర్గాల ప్రజలు కనీస సౌకర్యాలకు దూరంగా ఉంటున్నారు. మంచినీటి బావులు, స్మశాన వాటికల దగ్గర కూడా కుల వివక్ష నీడలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. పట్టణీకరణ పెరగడం వల్ల నగరాల్లో కొంత మార్పు వచ్చినప్పటికీ అంతర్గతంగా కుల భావం ఇంకా సజీవంగానే ఉంది. పెళ్లిళ్లు, సామాజిక కార్యక్రమాల సమయంలో ఈ విభజన రేఖలు బయటపడుతున్నాయి. విద్యావంతులైన వారు కూడా కుల సంఘాల చుట్టూ తిరగడం సమాజానికి చేటు కలిగిస్తుంది. విద్య అనేది మనిషిని సంస్కరించాలి తప్ప స్వార్థపూరిత కుల పిచ్చిని పెంచకూడదు. నేటితరం యువత కులాలకు అతీతంగా ఆలోచించినప్పుడే దేశం ప్రగతి పథంలో నడుస్తుంది. సామాజిక స్పృహ కలిగిన వ్యక్తులు ఇలాంటి వివక్షను ఖండించాలి.

రాజకీయాల్లో కులం ఒక బలమైన అస్త్రంగా మారింది. ఎన్నికల సమయంలో అభ్యర్థుల ఎంపిక నుండి ఓట్ల వేట వరకు ప్రతిదీ కుల సమీకరణాల ఆధారంగానే జరుగుతోంది. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం నాయకులు ప్రజల మధ్య కుల చిచ్చు పెడుతున్నారు. అభివృద్ధిని పక్కన పెట్టి కుల ప్రాతిపదికన వర్గాలుగా విడగొట్టడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. రాజకీయ లబ్ధి కోసం చేసే ఇటువంటి ప్రయత్నాలు సమాజంలో శాశ్వత విభజనకు దారితీస్తున్నాయి. పౌరులు కూడా ఆలోచించి తమ ప్రతినిధులను ఎంచుకోవాలి. కులం కంటే గుణం, పని తీరు ముఖ్యం అని భావించాలి. ఐక్యత లేని సమాజం ఎప్పటికీ బలహీనంగానే ఉంటుంది. ప్రజాస్వామ్య విలువలు రక్షించబడాలంటే కుల రహిత రాజకీయం అవసరం.

సామాజిక మాధ్యమాలు కూడా కుల వివక్షను పెంచడంలో తమవంతు పాత్ర పోషిస్తున్నాయి. కొన్ని గ్రూపులు కేవలం తమ కులం గొప్పతనాన్ని చాటుకుంటూ ఇతరులను కించపరుస్తున్నాయి. ఇది యువతలో ద్వేష భావాలను నింపుతోంది. టెక్నాలజీని సామాజిక చైతన్యం కోసం వాడాలి తప్ప ఇలాంటి పనుల కోసం కాదు. గతంలో జరిగిన తప్పులను పట్టుకుని వేలాడటం కంటే భవిష్యత్తును బాగు చేసుకోవడంపై దృష్టి పెట్టాలి. ప్రతి కులంలోనూ పేదరికం, కష్టాలు ఉంటాయి. అందరూ కలిసికట్టుగా పోరాడితేనే సమస్యలు పరిష్కారమవుతాయి. కుల రహిత సమాజం దిశగా అంతర్-కుల వివాహాలు ఒక సానుకూల మార్పుగా చెప్పవచ్చు. ప్రేమకు కులంతో పనిలేదని నిరూపిస్తున్న యువతను సమాజం ఆదరించాలి.

ఆర్థిక సమానత్వం కుల వివక్షను తగ్గించడానికి ఒక ప్రధాన మార్గం. అన్ని వర్గాల వారికి సమాన అవకాశాలు కల్పించినప్పుడు వివక్ష తనంతట తానుగా తగ్గుతుంది. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరాలి. కులంతో సంబంధం లేకుండా ప్రతిభ కలిగిన వారిని ప్రోత్సహించాలి. వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో అందరికీ భాగస్వామ్యం ఉండాలి. ఆర్థికంగా నిలదొక్కుకున్నప్పుడు సమాజంలో గౌరవం పెరుగుతుంది. ఇది కొంతవరకు కుల అహంకారాన్ని తగ్గిస్తుంది. అభివృద్ధిలో అందరినీ భాగస్వాములను చేయడం ద్వారానే సమ సమాజం సాధ్యమవుతుంది. కేవలం చట్టాలు మాత్రమే కాకుండా ఆర్థిక పురోగతి కూడా సామాజిక మార్పుకు నాంది పలుకుతుంది.

కుల వివక్ష అనేది కేవలం ఒక వర్గానికి సంబంధించిన సమస్య కాదు. ఇది మొత్తం దేశ పురోగతికి పెద్ద ఆటంకం. ప్రపంచ దేశాల ముందు మనం తల ఎత్తుకుని నిలబడాలంటే ఈ జాడ్యాన్ని వదిలించుకోవాలి. శాస్త్ర సాంకేతిక రంగాల్లో అద్భుతాలు సృష్టిస్తున్న మనం సామాజికంగా వెనకబడి ఉండటం ఆశ్చర్యకరం. ఆలోచనా విధానంలో విప్లవాత్మక మార్పు రావాలి. ప్రతి వ్యక్తిలోనూ ఒకే రక్తం ప్రవహిస్తుందని గుర్తించాలి. మతాలు, కులాలు మనిషి సృష్టించినవే తప్ప ప్రకృతి సిద్ధమైనవి కావు. ఈ సత్యాన్ని గ్రహించినప్పుడే వివక్షకు ముగింపు లభిస్తుంది. సామాజిక కార్యకర్తలు, మేధావులు కుల రహిత సమాజం కోసం నిరంతరం కృషి చేయాలి. సినిమా రంగం, సాహిత్యం కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. కులాలను రెచ్చగొట్టే దృశ్యాలను ప్రోత్సహించకూడదు. స్ఫూర్తినిచ్చే కథలను ప్రజలకు అందించాలి. ప్రతి ఒక్కరూ తమ వంతుగా ఈ సామాజిక మార్పులో భాగస్వాములు కావాలి. అప్పుడే మనం కోరుకున్న కుల వివక్ష లేని సమాజం సాధ్యమవుతుంది. భావి తరాలకు మనం ఇవ్వాల్సిన గొప్ప ఆస్తి వివక్ష లేని ప్రపంచం. మనిషిని మనిషిగా గౌరవించే సంస్కృతిని అలవర్చుకోవాలి. విభజనలను పక్కన పెట్టి ఐక్యంగా ముందుకు సాగాలి. సమాచార విప్లవంలో భాగస్వాములవుతూ నిజాలను నిర్భయంగా చాటుదాం. నిరంతర అప్రమత్తతతోనే పత్రికా రంగం తన ప్రాభవాన్ని కాపాడుకోగలదు.

కుల వివక్ష లేని సమాజం అనేది కేవలం కల కాదు. మనందరి సంకల్పం ఉంటే అది కచ్చితంగా నిజమవుతుంది. మన ఇంటి నుండే ఈ మార్పును ప్రారంభిద్దాం. కులం పేరుతో జరుగుతున్న దాడులను అరికట్టడానికి కఠినమైన శిక్షలు ఉండాలి. సామాజిక స్పృహ కలిగిన వ్యక్తులు బాధితులకు అండగా నిలబడాలి. మానవత్వం ఉన్న చోట వివక్షకు తావుండదు. భవిష్యత్తు తరాలకు సమానత్వంతో కూడిన నవ సమాజాన్ని అందిద్దాం. అప్పుడే భారతదేశం నిజమైన స్వేచ్ఛా వాయువులను పీల్చుకోగలదు. సమ సమాజ స్థాపన మనందరి ఉమ్మడి లక్ష్యం కావాలి. మనిషిని మనిషిగా చూసే రోజు కోసం అందరం కలిసి అడుగులు వేద్దాం.

# నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం






- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి
- నల్గొండ అర్బన్

**డెస్క్, మే 2, తరంగాలు** : నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం నల్గొండ జిల్లా కేంద్రంలోని న్యాక్ (నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్) లో నిర్వహించిన మెగా జాబ్ మేళాను ఆయన ప్రారంభించారు.అనంతరం నిరుద్యోగ యువతను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగ సమస్య అతిపెద్ద సమస్యగా ఉందని, అయితే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చదివిన చదువుకు ఉద్యోగం ఇచ్చే విధంగా కార్యచరణ ప్రణాళిక రూపొందించి ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన- ప్రగతి ప్రణాళికలో భాగంగా వివిధ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతున్నదని, అందులో భాగంగా అన్ని జిల్లాలలో మెగా జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నల్గొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన మెగా జాబ్ మేళా ద్వారా 5000 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించి అపాయింట్మెంట్ ఆర్డర్ ఇవ్వాలని ఆయన కంపెనీలతో కోరారు. యువత పెద్ద ఎత్తున జాబ్ మేళాకు వస్తున్నందున ఆదివారం కూడా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. నల్గొండ జిల్లా వ్యాప్తంగా సిమెంటు కంపెనీలు, రైస్ ఇండస్ట్రీస్, ఫార్మా తదితర అనేక కంపెనీలు ఉన్నాయని, అందువల్ల స్థానికులకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగం తో పాటు, కంపెనీలపై కూడా ఉందని అన్నారు. నిరుద్యోగ యువత ఎలాంటి ఉద్యోగం వచ్చినా ముందుగా చేరాలని, అనవసరంగా సమయం వృధా చేసుకోవద్దని ,ఉద్యోగం చేస్తూ ఉన్నత ఉద్యోగాల కోసం చదువుకోవాలని, ప్రత్యేకించి గ్రూపు ఇతర ఉద్యోగాలకు చదువుకోవాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా ఎంఎస్ ఎం ఈ కింద పరిశ్రమలు స్థాపించేందుకు అవకాశం ఉందని, దీని ద్వారా కూడా స్వయం ఉపాధి పొందవచ్చని అన్నారు. గతంలో తన హయాంలో నిర్వహించిన జాబ్ మేళా ద్వారా 18,400 మందికి ఉద్యోగాలు ఇచ్చినట్లు ఆయన గుర్తు చేశారు. నల్గొండ జిల్లా లోని న్యాక్ సంస్థ అతిపెద్దదని, దీని ద్వారా అనేక వృత్తులలో శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు .పట్టణంలో రోడ్లు, డ్రైన్లు, తాగునీటి సౌకర్యం అన్ని కల్పించామని అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదాలలో అనేక మంది చనిపోతున్నారని రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు రోడ్డు భద్రతను చట్టాలను కట్టుదిట్టంగా అమలు చేయాలని ఆయన జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. అదేవిధంగా ఇటీవల జిల్లాలో ఫార్మా కంపెనీలో సంభవించిన ప్రమాదాల పై మాట్లాడుతూ అన్ని కంపెనీలు భద్రత చర్యలను తప్పకుండా పాటించాలని చెప్పారు .

నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని జాబ్ మేళాను నిర్వహించడం జరుగుతున్నదని తెలిపారు.

జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక ద్వారా నిర్వహిస్తున్న జాబ్ మేళాలో నిరుద్యోగ యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సుమారు 124 కంపెనీలు జాబ్ మేళాలో ఉద్యోగాలు ఇచ్చేందుకు రావడం జరిగిందని, ఇందులో ఐటి, బ్యాంకింగ్ ,కంప్యూటర్ ,బిజినెస్ సర్వీస్ వంటి రంగాలలో ఉద్యోగాలు పొందేందుకు అవకాశం ఉందని తెలిపారు. కంపెనీలు వారి వద్ద ఉన్న అన్ని ఖాళీలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ మాట్లాడుతూ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం రావడం ద్వారా కుటుంబ ఆర్థిక పరిస్థితి మారుతుందని, ఇది మంచి అవకాశం అని అన్నారు.

డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ డైరెక్టర్ రాజేందర్రెడ్డి తదితరులు మాట్లాడారు.

స్థానిక సంస్థల ఇంచార్జ్ కలెక్టర్ వై. అశోక్ రెడ్డి డిప్యూటీ మేయర్ అష్రాఫ్ అలీ ,మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్ ,జిల్లా క్రీడలు, యువజన సర్వీసులు అభివృద్ధిలో శాఖ అధికారి అక్బర్ ఆలీ, పరిశ్రమల శాఖ జిఎం సతీష్, న్యాక్ అధికారులు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఎన్నికలు,కలెక్షన్ల మీద ఉన్న శ్రద్ధ దేశ ప్రజల సమస్యలపై లేదు

- టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్



**హైదరాబాద్, మే 2,తరంగాలు** : అయిదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసిన వెంటనే వాణిజ్య సిలిండర్ ధరను రూ.1000 వరకు పెంచడం కేంద్ర ప్రభుత్వ పెద్దల క్రూరత్వానికి పరాకాష్టగా చెప్పొచ్చు అని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ అన్నారు.దేశం, ధర్మం కోసం ప్రతినిత్యం నీతి సూత్రాలు చెప్పే బీజేపీ నాయకులు ఇప్పుడు దేశ ప్రజలకు ఏం సమాధానం చెప్తారో చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.కేంద్రంలోని బీజేపీ పెద్దలకు ఎన్నికలు, కలెక్షన్ల మీద ఉన్న శ్రద్ధ దేశ ప్రజల సమస్యలపై లేదని ఇది స్పష్టమవుతోంది. ఎన్నికలు పూర్తయ్యాక వెంటనే ధరలు పెంచడం వారి చిత్తశుద్ధిని ప్రశ్నార్థకంగా మారుస్తోంది.కేంద్ర ప్రభుత్వ చర్యల వల్ల దాదాపు 145 కోట్ల మంది ప్రజలపై ప్రత్యక్షంగా, పరోక్షంగా భారం పడుతోంది. ఇప్పటికే బల్క్ డీజిల్ వినియోగించే సంస్థలపై అదనంగా రూ.12 వరకు ధరలు పెంచి ప్రజలపై మరింత భారాన్ని మోపుతున్నారు.కొన్ని రాష్ట్రాల్లో నెలవారీ గ్యాస్ ఖర్చులు రూ.1500 వరకు పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విధంగా ఎడా పెడా ధరలు పెంచడం వల్ల సాధారణ ప్రజల జీవితం కష్టసాధ్యమవుతోందిఎన్నికల ముందు రాహుల్ గాంధీ చెప్పినట్లే, ఎన్నికలు పూర్తయ్యాక ధరలు పెంచడం ద్వారా కేంద్ర ప్రభుత్వ అసలు ఉద్దేశ్యం బయటపడింది.అంతేకాక, త్వరలోనే పెట్రోల్, డీజిల్ ధరలు పెంచే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ ఆరాచక పాలన, పన్నుల పెంపు, ప్రజావ్యతిరేక విధానాలను దేశ ప్రజలు ఖండించాల్సిన సమయం ఆసన్నమైంది.అంతర్జాతీయ మార్కెట్ ధరలను సాకుగా చూపుతూ అవసరమైన వస్తువులపై పన్నులు పెంచడం ఎంతవరకు సమంజసం? వెంటనే ఫ్యూయల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.ధరలను నియంత్రించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉన్నప్పటికీ, పన్నులు పెంచుతూ ప్రజలపై భారాలు మోపడం దురదృష్టకరం అన్నారు.అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోకుండా ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తున్నారు.ప్రజలే సరైన సమయంలో తగిన గుణపాఠం చెబుతారని సుధాకర్ గౌడ్ హెచ్చరించారు.

## ఈ లక్షణాలు కనిపిస్తే జీర్ణ వ్యవస్థ ఆరోగ్యం సరిగ్గా లేనట్లే.. ఏం చేయాలంటే

ప్రస్తుత కాలంలో జీవనశైలి మార్పులు, ప్రాసెస్డ్ ఆహారం, ఒత్తిడి, నిద్రలేమి వంటి కారణాలతో ఆరోగ్య సమస్యలు వేగంగా పెరుగుతున్నాయి. ముఖ్యంగా జీర్ణవ్యవస్థకు సంబంధించిన సమస్యలు ఎక్కువమందిలో కనిపిస్తున్నాయి. చాలా సందర్భాల్లో బయటికి కనిపించే లక్షణాలనే పట్టించుకుంటారు కానీ వాటి మూల కారణం గట్ (జీర్ణ వ్యవస్థ) ఆరోగ్యంతో సంబంధం ఉండొచ్చని గుర్తించరు. అందుకే గట్ ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకోవడం ఎంతో అవసరం. ఇక శరీర ఆరోగ్యానికి గట్ (+బ్) ఎంత ముఖ్యమో కొత్త పరిశోధనలు మరోసారి స్పష్టం చేస్తున్నాయి. సెకండ్ బ్రెయిన్ గా పిలిచే గట్ సరిగా పనిచేయకపోతే, అది కేవలం జీర్ణక్రియకే కాకుండా మెదడు పనితీరు, రోగనిరోధక శక్తి, చర్మ ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపుతుంది. 16వ ప్రోబయోటిక్ సింపోజియంలో నిపుణులు వెల్లడించిన వివరాల ప్రకారం, భారత్‌లో 10 మందిలో 7 మంది ఏదో ఒక గట్ సమస్యతో బాధపడుతున్నారని వెల్లడైంది.

### జీర్ణ వ్యవస్థలో వాపు పెరిగితే..

గట్ అసమతుల్యత ) అనేది చాలా సార్లు స్పష్టంగా కనిపించని లక్షణాల ద్వారా బయటపడుతుంది. వీటిని సాధారణంగా గమనించకుండా వదిలేస్తారు. అయితే ఈ సంకేతాలను ముందుగానే గుర్తిస్తే, ఆరోగ్య సమస్యలను నివారించవచ్చు. గట్ అసమతుల్యతను సూచించే సంకేతాల గురించి వైద్యులు వివరిస్తున్నారు. గట్ అసమతుల్యతకు ఒక ముఖ్య సంకేతం తలలో నిరంతరం చుండ్రు లేదా దురద. గట్‌లో ఇన్ఫ్లమేషన్ పెరిగితే అది చర్మంపై కూడా ప్రభావం చూపుతుంది. మంచి బ్యాక్టీరియా, చెడు బ్యాక్టీరియా మధ్య సమతుల్యత కోల్పోతే ఈ సమస్యలు వస్తాయి. అలాగే కారణం తెలియని అలసట కూడా గట్ సమస్యలకు సంకేతంగా నిలుస్తుంది. సరిపడా విశ్రాంతి తీసుకున్నా కూడా అలసటగా అనిపిస్తే, అది శరీరానికి అవసరమైన పోషకాలు సరిగ్గా శోషించకపోవడం వల్ల అవుతుంది.

### చక్కెర పట్ల ఆకర్షణ పెరగడం

మూడవ లక్షణం మూడ్ స్వింగ్స్ లేదా ఆందోళన. గట్, మెదడు మధ్య ఉన్న సంబంధం (గట్-బ్రెయిన్ యాక్సిస్) వల్ల గట్ ఆరోగ్యం ప్రభావితం అయితే సెరోటోనిన్ ఉత్పత్తి తగ్గి భావోద్వేగాల్లో మార్పులు వస్తాయి. అలాగే బ్లోటింగ్ (ఉబ్బరం), అసమాన మల విసర్జన కూడా గట్ సమస్యలకు ప్రధాన సంకేతాలు. ఇవి ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్ వంటి సమస్యలకు దారితీస్తాయి. ఈ లక్షణాలు నిరంతరం ఉంటే వైద్యులను సంప్రదించడం అవసరం. చక్కెర పట్ల ఆకర్షణ పెరగడం కూడా గట్ అసమతుల్యతకు మరో సూచన. గట్‌లో చెడు బ్యాక్టీరియా పెరిగితే అవి చక్కెరపై ఆధారపడతాయి. దీంతో తీపి తినాలనే కోరిక పెరుగుతుంది. చర్మంపై మొటిమలు లేదా బ్రేకౌట్స్ రావడం కూడా గట్ ఆరోగ్యంతో సంబంధం కలిగి ఉంటుంది.

### అధికంగా ప్రాసెస్డ్ ఫుడ్ ను తింటే..

అధికంగా ప్రాసెస్డ్ ఫుడ్ తీసుకోవడం వల్ల గట్ బలహీనపడి చర్మ సమస్యలు పెరుగుతాయి.

THARANGALU DAILY NEWS
ఆదివారం, 03 మే, 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

# బ్యాట్‌తో కుల్దీప్ ముఖంపై కొట్టబోయిన జడేజా..

ఐపీఎల్ 2026లో భాగంగా నిన్న రాజస్థాన్ రాయల్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆసక్తికర సంఘటన జరిగింది. రాజస్థాన్ టీమ్‌కు చెందిన రవీంద్ర జడేజా, ఢిల్లీ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ మధ్య ఈ ఘటన జరిగింది. అయితే వీరిద్దరూ కొట్టుకునే స్థాయికి వెళ్లారని చూపరులకు కనిపిస్తుంది. కానీ, అక్కడ జరిగింది అందుకు పూర్తి విరుద్ధం. రాజస్థాన్ రాయల్స్ జట్టు బ్యాటింగ్ చేస్తున్న క్రమంలో ధ్రువ్ జూరెల్ అవుటైన తర్వాత 12వ ఓవర్‌లో జడేజా బ్యాటింగ్‌కు వచ్చాడు. అదే సమయంలో ఈ విచిత్ర సంఘటన జరిగింది. రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్‌లు ఒకరినొకరు సరదాగా ఆటపట్టించుకోవడం కనిపించింది. ఇప్పుడు అందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. కుల్దీప్ తన వైపు రావడం గమనించిన జడేజా, తన టీమ్‌ఇండియా పార్ట్‌నర్‌ను భయపెట్టాలనే ఉద్దేశంతో వ్యూహాత్మకంగా బ్యాట్ ఝుళిపించాడు. అయితే, కుల్దీప్ ఏమాత్రం చలించకుండా, జడేజా భుజాలపై చేతులు వేసి తేలికగా నెట్టాడు. జడేజా తన బ్యాట్‌ను అంపైర్‌తో తనిఖీ చేయించుకోబోతుండగా, కుల్దీప్ అతడిని పట్టుకుని మళ్లీ నెట్టాడు. వారి మధ్య జరిగిన ఈ సరదా వాగ్వాదం సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఇదిలా ఉండగా.. ఈ మ్యాచ్ ద్వారా ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు వరుసగా మూడు ఓటముల పరంపరకు ముగింపు పలికి, ఐపీఎల్‌లో తమ అత్యధిక విజయవంతమైన ఛేజింగ్‌ను పూర్తి చేసింది. జైపూర్‌లో 226 పరుగుల లక్ష్యాన్ని ఛేదిస్తున్న క్రమంలో, ఓపెనర్లు కేఎల్ రాహుల్, పతుమ్ నిస్సంకల అర్ధశతకాల చెలరేగిన వేళ రాజస్థాన్ రాయల్స్ జట్టుపై ఢిల్లీ ఘనవిజయం సాధించింది.



పతుమ్ నిస్సంక 33 బంతుల్లో 62 పరుగులతో ఛేజింగ్‌లో రాజస్థాన్ జట్టుపై అద్భుతమైన ఆరంభాన్ని అందించగా, కేఎల్ రాహుల్ 40 బంతుల్లో 75 పరుగులు చేసి ఢిల్లీని విజయానికి చేరువ చేశాడు. నిస్సంకతో కలిసి 110 పరుగుల ఓపెనింగ్ భాగస్వామ్యం నెలకొల్పిన సమయంలో రాహుల్ అతనికి సహకరించినప్పటికీ, నిస్సంక అవుటైన తర్వాత డీసీ ఇన్నింగ్స్‌కు ఎంతో అవసరమైన ఊపునిచ్చాడు. చివరికి, నితీష్ రాణా (33), అశుతోష్ శర్మ (25లి), ట్రిస్టన్ స్టబ్స్ (18లి) అందించిన విలువైన ఇన్నింగ్స్‌తో రాణించారు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ రాయల్స్ జట్టు కెప్టెన్ రియాన్ పరాగ్ 50 బంతుల్లో 90 పరుగులు చేసి ఫామ్‌లోకి తిరిగి వచ్చాడు. ఇది ఈ సీజన్‌లో అతని మొదటి యాభైకి పైగా స్కోరు. అదే సమయంలో, డోనోవన్ ఫెరీరా 14 బంతుల్లో 47 నాటౌట్ పరుగులతో మెరుపు ఇన్నింగ్స్ ఆడటంతో, బ్యాటింగ్ ఎంచుకున్న == జట్టు 225/6 అనే బలమైన స్కోరును నమోదు చేసింది. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన గత మ్యాచ్‌లో 'వేపింగ్' చేస్తూ పట్టుబడి జరిమానాకు గురైన పరాగ్, తొలి రెండు ఓవర్లలోనే యశస్వి జైస్వాల్ (6), వైభవ్ సూర్యవంశీ (4) అవుటైన తర్వాత, ధృవ్ జురెల్ (42)తో కలిసి ఇన్నింగ్స్‌ను పటిష్టం చేశాడు.

# చెపాక్‌లో గైక్వాడ్, కార్తిక్ షో..

### ఎల్ క్లాసికోలో మళ్లీ చిత్తైన ముంబై..!

ఐపీఎల్ అభిమానులు ఆసక్తి కనబరిచే ఎల్ క్లాసికో పోరులో మళ్లీ చెన్నై సూపర్ కింగ్స్(జూఖ)దే పైచేయి. వాంఖడేలో ముంబై ఇండియన్స్(వీబఎఝఱ ×అఎఋఅం)ను చిత్తుగా ఓడించిన చెన్నై.. ఈసారి సొంతగడ్డపై పంజా విసిరింది. అన్షుల్ కంబోజ్(3-32) బంతితో విజృంభిచగా.. రుతురాజ్ గైక్వాడ్(67 నాటౌట్) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. ఇంప్యాక్ట్ సబ్ కార్తిక్ శర్మ(54 నాటౌట్)తో అర్ధ శతక భాగస్వామ్యం నెలకొల్పి ముంబైని ముంచాడు. ఈ సీజన్‌లో నాలుగో విజయంతో సీఎస్కే ఖాతాలో ఎనిమిది పాయింట్లు చేరాయి.

ఐపీఎల్-19లో చెన్నై సూపర్ కింగ్స్ నాలుగో విజయంతో మురిసింది. చెపాక్ స్టేడియంలో ముంబై ఇండియన్స్‌ను 159కే కట్టడి చేసిన చెన్నై స్వల్ప లక్ష్యాన్ని ఊదిపడేసింది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్(67 నాటౌట్), ఇంప్యాక్ట్ సబ్ కార్తిక్ శర్మ(54 నాటౌట్)లు ముంబై బౌలింగ్ దళాన్ని సమర్ధంగా ఎదుర్కొని గెలుపు పునాది వేశారు. బౌండరీకి తరలించగా 8 వికెట్ల తేడాతో గెలుపొందింది సీఎస్కే.మోస్తరు ఛేదనలో బుమ్రా తన మొదటి ఓవర్లోనే డేంజరస్ సంజూ శాంసన్(11)ను బౌల్ట్ చేసి తొలి వికెట్ అందించాడు. అనంతరం కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్(67 నాటౌట్) జతగా ఉర్విల్ పటేల్(26) చెలరేగాడు. 5వ ఓవర్లో 6, 4, 6తో 18 రన్స్ రాబట్టిన ఉర్విల్.. గజన్‌ఫర్ ఓవర్లో పెద్ద షాట్ ఆడబోగా బంతి ఎడ్జ్ తీసుకొని వికెట్లకు తాకింది. పవర్ ప్లేలో 2 వికెట్ల నష్టానికి 62 పరుగులు చేసిన చెన్నైని గెలిపించే బాధ్యత తీసుకున్నారు గైక్వాడ్, ఇంప్యాక్ట్ సబ్ కార్తిక్ శర్మ(54 నాటౌట్).



పాండ్యా ఓవర్లో మిడ్ వికెట్ దిశగా కొట్టిన సిక్సర్‌తో చెన్నై స్కోర్ వంద దాటింది. ముంబై బౌలర్లకు ఏమాత్రం అవకాశమివ్వకుండా అర్ధ శతక భాగస్వామ్యంతో గెలుపు దిశగా నడిపారు. గజన్‌ఫర్ వేసిన ఓవర్లో కార్తిక్ 4, 6, 4తో 14 రన్స్ పిండుకున్నాడు. అదే ఊపులో బౌండరీతో చెన్నైకి ఎనిమిది వికెట్ల విజయాన్ని కట్టబెట్టాడు. తొమ్మిది మ్యాచుల్లో రెండింట మాత్రమే గెలిచిన ముంబై ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించే పరిస్థితి తెచ్చుకుంది.





### ఆదుకున్న నమన్ ధిర్

గత మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదారబాద్‌పై 243 పరుగులు చేసిన ముంబై ఇండియన్స్ చెపాక్‌లో తడబడింది. సొంత మైదానంలో సీఎస్కే పేసర్ అన్షుల్ కంబోజ్(3-32) విజృంభణకు ముంబై స్టార్లు తేలిపోగా.. నమన్ ధిర్(57) సాధికారిక ఇన్నింగ్స్ ఆడాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా ఓపెనర్ రికెల్టన్(37)తో.. ఆపై సూర్యకుమార్ యాదవ్(21)తో కీలక పరగుఉల జోడించి అర్ధ శతకంతో ముంబైని ఆదుకున్నాడు. ఆఖర్లో దంచేస్తాడనుకున్న కెప్టెన్ హార్దిక్ పాండ్యా(18) పెద్ద షాట్లు ఆడలేకపోయాడు. బోల్ట్ సిక్సర్‌తో ముంబై నిర్ణీత ఓవరల్లో 159 పరుగులే చేసింది.

## రిటైర్మెంట్ ఆలోచన లేదు: స్టార్క్

ఐపీఎల్ 2026లో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న క్షణం రానే వచ్చింది. సుదీర్ఘ విరామం, గాయాల తర్వాత ఆస్ట్రేలియా స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ స్టేడియంలో అడుగుపెట్టాడు. జైపూర్‌లోని సవాయ్ మాన్‌సింగ్ స్టేడియంలో రాజస్థాన్ రాయల్స్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో మిచెల్ స్టార్క్ తన రీ-ఎంట్రీని ఘనంగా చాటుకున్నాడు. రాజస్థాన్ బ్యాటర్లను వణికించి 3 కీలక వికెట్లు పడగొట్టి ఢిల్లీ విజయంలో కీలక పాత్ర పోషించాడు.అయితే మ్యాచ్ సమయంలో స్టార్క్ బౌలింగ్ చేతికి భారీగా కట్టు ఉండటం చూసి అతని ఫిట్ నెస్ ఇంకా పూర్తిస్థాయిలో లేదని.. త్వరలోనే ఆయన ఆటకు స్వస్తి పలుకుతాడని సోషల్ మీడియాలో వార్తలు గుప్పుమన్నాయి.ఈ పుకార్లకు మిచెల్ స్టార్క్ మ్యాచ్ అనంతరం ముగింపు పలికాడు. తన రిటైర్మెంట్ గురించి వస్తున్న వార్తలపై స్పందిస్తూ.. "ప్రస్తుతానికి నాకు అలాంటి ఆలోచనే లేదు. చేతికి కట్టు ఉండటం చూసి రిటైర్మెంట్ గురించి మాట్లాడటం కాస్త వింతగా ఉంది. నేను ఇంకా ఆ దశకు చేరుకోలేదని భావిస్తున్నాను" అని మిచెల్ స్టార్క్ స్పష్టం చేశాడు. గత కొన్ని నెలలుగా క్రికెట్‌కు దూరంగా ఉండి.. కేవలం ఫిట్‌నెస్, గాయాల నుంచి కోలుకోవడంపైనే దృష్టి సారించానని, ఇప్పుడు మైదానంలోకి తిరిగి రావడం తనలో ఎంతో ఉత్సాహాన్ని నింపిందని స్టార్క్ కుండబద్దలు కొట్టాడు. 35 ఏళ్ల వయసులో కూడా తనలో ఇంకా చాలా క్రికెట్ మిగిలి ఉందని ఈ సందర్భంగా స్టార్క్ చాటిచెప్పాడు.రాజస్థాన్ ఇన్నింగ్స్ ప్రారంభమైన మొదటి ఓవర్‌లోనే మిచెల్ స్టార్క్ తన సత్తా ఏంటో చూపించాడు. యువ సంచలనం యశస్వి జైస్వాల్ మొదటి రెండు బంతుల్లోనే భారీ సిక్సర్‌తో స్టార్క్‌ను స్వాగతించినప్పటికీ.. స్టార్క్ మాత్రం తడబడలేదు. మూడో బంతికే అద్భుతమైన డెలివరీతో జైస్వాల్‌ను ఔట్ చేసి ప్రతీకారం తీర్చుకున్నాడు. ఆ తర్వాత సెంచరీకి చేరువవుతున్న రాజస్థాన్ కెప్టెన్ రియాన్ పరాగ్‌తో పాటు రవీంద్ర జడేజా వికెట్లను కూడా తీసి రాజస్థాన్ స్కోరు వేగానికి బ్రేకులు వేశాడు. 4 ఓవర్లలో 40 పరుగులు ఇచ్చి 3 వికెట్లు పడగొట్టి తన రాకను ఘనంగా చాటాడు.

## జెమీసన్ ప్రవర్తనపై నెటిజన్ల ఫైర్



ఐపీఎల్ 2026 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ సంచలనం వైభవ్ సూర్యవంశీ ప్రతి మ్యాచ్‌లోనూ రికార్డుల వేట కొనసాగిస్తున్నాడు. అయితే దిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన లేటెస్ట్ మ్యాచ్‌లో 15 ఏళ్ల కుర్రాడికి ఒక చేదు అనుభవం ఎదురైంది. సాధారణంగా వికెట్ తీసినప్పుడు బౌలర్లు సంబరాలు చేసుకోవడం సహజమే కానీ దిల్లీ పేసర్ కైల్ జెమీసన్ మాత్రం హద్దులు దాటి ప్రవర్తించాడు. తనకంటే సగం వయసున్న వైభవ్‌ను అవుట్ చేసిన తర్వాత జెమీసన్ ఇచ్చిన అగ్రెసివ్ సెండ్ ఆఫ్ ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో పెద్ద దుమారం రేపుతోంది. ఒక చిన్న పిల్లాడిపై అంత కోపం చూపించాల్సిన అవసరం ఏముందని నెటిజన్లు జెమీసన్‌ను ఏకిపారేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఇప్పుడు ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారింది. మ్యాచ్ రెండో ఓవర్‌లోనే ఈ డ్రామా చోటుచేసుకుంది. జెమీసన్ వేసిన నాలుగో బంతిని వైభవ్ అద్భుతమైన ఫోర్‌గా మలిచాడు. ఆ మరుసటి బంతికే జెమీసన్ ఒక పదునైన ఇన్ స్వింగింగ్ యార్కర్ వేశాడు. ఆ వేగాన్ని అంచనా వేయడంలో విఫలమైన వైభవ్ క్లీన్ బౌల్డ్ అయ్యాడు. వికెట్ పడగానే జెమీసన్ ఒక్కసారిగా వైభవ్ వైపు చూస్తూ గట్టిగా అరుస్తూ సెండ్ ఆఫ్ ఇచ్చాడు. ఒక సీనియర్ స్టార్ ప్లేయర్‌ను అవుట్ చేసిన రేంజ్‌లో జెమీసన్ ఇచ్చిన రియాక్షన్ చూసి స్టేడియంలో ఉన్న వారంతా షాక్ అయ్యారు. ఈ సీజన్‌లో అద్భుతమైన ఫామ్‌లో ఉన్న వైభవ్ కేవలం 4 పరుగులకే వెనుదిరగడం రాజస్థాన్ రాయల్స్‌కు గట్టి దెబ్బే అని చెప్పాలి.ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు దిల్లీ క్యాపిటల్స్ పేసర్ కైల్ జెమీసన్‌కు బీసీసీఐ వార్నింగ్ ఇవ్వడంతో పాటు ఒక డెమెరిట్ పాయింట్‌ను విధించింది. రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీని అవుట్ చేసిన తర్వాత జెమీసన్ అతనికి చాలా దగ్గరగా వెళ్లి అగ్రెసివ్‌గా ప్రవర్తించాడని ఐపీఎల్ అధికారిక ప్రకటనలో తెలిపింది. ప్రత్యర్థి ఆటగాడిని రెచ్చగొట్టేలా లేదా అవమానించేలా ప్రవర్తించడం ఐపీఎల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌లోని ఆర్టికల్ 2.5 ప్రకారం నేరం కావడంతో మ్యాచ్ రెఫరీ రాజీవ్ సేథ్ ఈ శిక్షను ఖరారు చేశారు. జెమీసన్ తన తప్పును ఒప్పుకోవడంతో పాటు ఈ జరిమానాను అంగీకరించినట్లు సమాచారం.భారత మాజీ క్రికెటర్ ప్రియాంక్ పాంచల్ ఈ ఘటనపై సోషల్ మీడియా వేదికగా స్పందించారు.

## రఫ్ఫాడించిన రాహుల్, నిస్సంక



రాజస్థాన్ రాయల్స్?పై దిల్లీ క్యాపిటల్స్ రఫ్ఫాడించింది. గత మ్యాచ్?లో ఆర్సీబీపై 75 పరుగులకే కుప్పకూలిన దిల్లీ రాజస్థాన్?పై పంజా విసిరింది. 226 పరుగుల భారీ టార్గెట్?ను సైతం అలవోకగా ఛేదించింది. ఫలితంగా హ్యాట్రిక్ ఓటముల తర్వాత గెలుపు బాట పట్టింది. ఓపెనర్లు కేఎల్ రాహుల్ (75 పరుగులు), పాథుమ్ నిస్సంక (62 పరుగులు) మెరుపు హాఫ్ సెంచరీలతో రాణించడంతో భారీ ఛేదనను దిల్లీ 19.1 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. రాజస్థాన్ బౌలర్లలో రవీంద్ర జడేజా, తుషార్ దేశ్?పాండే, జోఫ్రా ఆర్చర్ తలో 1 వికెట్ పడగొట్టారు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 225 పరుగులు చేసింది. కెప్టెన్ రియాన్ పరాగ్ (90 పరుగులు) సత్తా చాటాడు. ధ్రువ్ జురెల్ (42 పరుగులు) రాణించాడు. చివర్లో డోనొవన్ ఫరీర్ (47 పరుగులు, 14 బంతుల్లో) రెచ్చిపోయాడు. దీంతో రాజస్థాన్?కు భారీ స్కోర్ దక్కింది. దిల్లీ బౌలర్లలో మిచెల్ స్టార్క్ 3, కైల్ జెమీసన్, అక్షర్ పటేల్, నటరాజన్ తలో 1 వికెట్ దక్కించుకున్నారు. తాజా విజయంతో దిల్లీ ప్లేఆఫ్స్ అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. ఆ జట్టు ఇప్పటిదాకా 9 మ్యాచ్?లు ఆడగా నాలుగింట్లో నెగ్గింది. ఐదు మ్యాచ్?ల్లో ఓడింది. 8 పాయింట్లతో ప్రస్తుతం ఆరో స్థానానికి దూసుకెళ్లింది. మరోవైపు, రాజస్థాన్ 10 మ్యాచ్?ల్లో నాలుగో ఓటమితో నాలుగో ప్లేస్?లో కొనసాగుతోంది.


### ఆకాశమే హద్దుగా చెలరేగిపోతున్న కేఎల్ రాహుల్

రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన ఉత్కంఠభరిత పోరులో ఢిల్లీ క్యాపిటల్స్ ప్లేయర్ కేఎల్ రాహుల్ విశ్వరూపం ప్రదర్శించాడు. 226 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో ఏమాత్రం తడబడకుండా కేవలం 40 బంతుల్లోనే 75 పరుగులు సాధించాడు. తన ఇన్నింగ్స్‌లో 6 ఫోర్లు, 5 సిక్సర్లతో ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఈ క్రమంలోనే ఆయన ఐపీఎల్ చరిత్రలో ఒక అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు.ఈ మ్యాచ్‌లో బాదిన 5 సిక్సర్ల ద్వారా కేఎల్ రాహుల్ ఐపీఎల్ చరిత్రలో ఓపెనర్‌గా 200 సిక్సర్ల మైలురాయిని అధిగమించాడు. ఈ ఘనత సాధించిన మొట్టమొదటి భారతీయ బ్యాటర్‌గా ఆయన చరిత్ర సృష్టించాడు. ఇప్పటివరకు భారత్ నుంచి మరే ఓపెనర్ కూడా ఈ ఫీట్ సాధించలేదు. అంతర్జాతీయ స్థాయిలో క్రిస్ గేల్ (326), డేవిడ్ వార్నర్ (210) మాత్రమే రాహుల్ కంటే ముందున్నాడు. ప్రస్తుతం 203 సిక్సర్లతో రాహుల్ మూడో స్థానంలో కొనసాగుతున్నాడు.భారత క్రికెట్‌లో అత్యంత నమ్మదగ్గ ఆటగాడిగా గుర్తింపు పొందిన రాహుల్, ఓపెనర్‌గా తనదైన ముద్ర వేశాడు. ఇప్పటివరకు ఐపీఎల్‌లో ఓపెనర్‌గా 112 మ్యాచ్‌లు ఆడి 50.1 సగటుతో 4851 పరుగులు సాధించాడు. ఇందులో 6 శతకాలు, 39 అర్ధ శతకాలు ఉండటం విశేషం. ఈ జాబితాలో విరాట్ కోహ్లీ 192 సిక్సర్లతో రాహుల్ వెనుక ఉండగా, రోహిత్ శర్మ కనీసం మొదటి ఐదు స్థానాల్లో కూడా లేకపోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

జాతీయ దిన పత్రిక
తరంగాలు
THARANGALU DAILY NEWS
ఆదివారం, 03 మే , 2026



## పృథ్వీరాజన్ సుకుమారన్...ఐ నోబడీ



మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్, టాలెంటెడ్ నటి పార్వతి తిరువోతు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం ఐ, నోబడీ.. 'రోషాక్' వంటి ప్రయోగాత్మక చిత్రంతో మెప్పించిన దర్శకుడు నిసామ్ బషీర్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన అఫీషియల్ టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ టీజర్ చూస్తుంటే, సినిమా కథాంశం ఒక వ్యక్తి తన అస్తిత్వం కోసం చేసే పోరాటం లేదా రహస్యం చుట్టూ తిరుగుతుందని అర్థమవుతోంది. ఒక సాధారణ ఉద్యోగి అనుకోకుండా కొన్ని క్లిష్ట పరిస్థితుల్లో చిక్కుకుంటాడు. ఆ ప్రమాదం నుండి తనను తాను కాపాడుకుంటూనే, తన కుటుంబాన్ని ఎలా రక్షించుకున్నాడు అనేదే ఈ చిత్ర ప్రధాన కథాంశంగా కనిపిస్తోంది. ఇందులో పృథ్వీరాజ్ సరికొత్త లుక్, పార్వతి నటన సినిమాపై భారీ అంచనాలను పెంచుతున్నాయి. వీరిద్దరి కాంబినేషన్ ఈ చిత్రానికి ప్రధాన బలంగా నిలవనుంది. జేక్స్ బిజోయ్ అందించిన నేపథ్య సంగీతం టీజర్‌కు ప్రాణం పోసింది. ప్రతి సన్నివేశాన్ని తన మ్యూజిక్‌తో ఆయన ఎంతో ఉత్కంఠభరితంగా మలిచారు.

## వారణాసి కోసం జర్మనీలో మహేశ్‌బాబు



రాజమౌళి – మహేశ్ బాబు కాంబినేషన్‌లో రానున్న 'వారణాసి' కోసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న ని నీ ( వి య ం ం ల ం ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం మహేశ్ బాబు జర్మనీలోని బ్లాక్ ఫారెస్ట్ లో ఉన్నారు. అక్కడ ఆయన ఫిట్‌నెస్, వెల్‌నెస్ నిపుణులు డాక్టర్ హ్యారీ కోనిగ్ పర్యవేక్షణలో కఠినమైన శిక్షణ పొందుతున్నారు. దీనికి సంబంధించిన ఫోటోలను మహేశ్ స్వయంగా తన సోషల్ మీడియాలో పంచుకున్నారు. ట్రెక్కింగ్‌లో ట్రైనింగ్ తీసుకుంటూ వారణాసి కోసం సిద్ధమవుతున్నట్లు క్యాప్షన్ పెట్టారు. ప్రస్తుతం ఈ ఫోటోలు వైరల్ అవుతున్నాయి. గ్లోబల్ ప్రేక్షకులను ఆకర్షించడమే లక్ష్యంగా రాజమౌళి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. 'వారణాసి' సినిమాతో మరిన్ని కొత్త మార్కెట్లనీ కొల్లగొట్టాలనే ప్రణాళికల్ని చిత్రబృందం సిద్ధం చేసింది. ముఖ్యంగా దక్షిణ అమెరికాతోపాటు, లాటిన్ అమెరికా దేశాల మార్కెట్‌పైన గురిపెట్టినట్టు తెలుస్తోంది. 'వారణాసి' కథ కూడా పలు దేశాలతో ముడిపడినది కావడం, కథానాయకుడు ప్రపంచాన్ని చుట్టే సాహసికుడు కావడంతో... మరిన్ని కొత్త దేశాలకు, కొత్త మార్కెట్లకీ ఈ సినిమాని తీసుకెళ్లాలనే ప్రణాళికలు రచిస్తున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది.

## జూన్ 26న లెనిన్ విడుదల




'ఏజెంట్'వంటి డిజాస్టర్ తర్వాత 'లెనిన్'తో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమయ్యాడు అఖిల్ అక్కినేని. ఇటీవల ఈ చిత్రం గురించి కింగ్ నాగార్జున పాజిటివ్‌గా స్పందించడంతో.. అక్కినేని అభిమానుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. మురళి కిషోర్ అబ్బురు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై టాలీవుడ్ వర్గాల్లో ఇప్పటికే మంచి అంచనాలు ఉన్నాయి. ఇది అఖిల్ కెరీర్‌ను మలుపు తిప్పే చిత్రమవుతుందని అభిమానులు గట్టిగా నమ్ముతున్నారు. అయితే లెనిన్ సినిమా విడుదల తేదీపై గత కొన్ని రోజులుగా నెలకొన్న సందిగ్ధతకు ఇప్పుడు తెరపడింది. లెనిన్ వాయిదా పడుతుందనే వార్తలు వచ్చినప్పటికీ.. తాజాగా పరిస్థితులు అనుకూలించాయి. రామ్ చరణ్ 'పెద్ది' సినిమాను జూన్ 4న విడుదల చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించడంతో ఎలాంటి పోటీ లేకుండా జూన్ 26న 'లెనిన్' సోలోగా బాక్సాఫీస్ వద్ద సందడి చేసేందుకు మార్గం సుగమమైంది. ఇతర పెద్ద సినిమాల పోటీ లేకపోవడం లెనిన్‌కు పెద్ద ప్లస్ పాయింట్‌గా మారుతుందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఫ్యాన్స్ నుంచి డబ్బులు గుంజడం సరికాదు

### దర్శకుడు రవిబాబు సంచలన కామెంట్స్



వైవిధ్యమైన చిత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే దర్శకుడు రవిబాబు, సినిమా టికెట్ల ధరలు, ఫ్యాన్స్ షోల గురించి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన స్వీయ దర్శకత్వంలో రాబోతున్న తాజా చిత్రం రేజర్ . ఈ చిత్రం మే 8న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా వరుస ప్రమోషన్స్‌లో పాల్గొంటున్నాడు రవిబాబు. అయితే ఈ ప్రమోషన్స్‌లో భాగంగా ఫస్ట్ డే ఫస్ట్ షోకి టాలీవుడ్‌లో టికెట్ రేట్లు పెంచడంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. సినిమా విడుదలైన మొదటి రోజు థియేటర్లకు వచ్చే ఫ్యాన్స్ దగ్గర ఎక్కువ డబ్బులు వసూలు చేయడం చాలా తప్పని తెలిపిన రవిబాబు మొదటి రోజు అభిమానులకు సినిమాను ఉచితంగా చూపించాలని అన్నారు. అభిమాన హీరో సినిమాను భుజాన వేసుకుని మోసేది వారే. అటువంటి వారిపై అదనపు భారం వేయడం సరికాదు అంటూ రవిబాబు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా పెద్ద సినిమాల విడుదల సమయంలో టికెట్ ధరలు పెంచడం వల్ల సామాన్య అభిమానులు ఇబ్బంది పడుతున్నారని, దీనిని మార్చాలని ఆయన సూచించారు.

## 94 ఏళ్ల వయసు ..సింగీతం మెగాఫోన్




### సింగ్ గీతం మూవీతో మళ్లీ సత్తా చాటేందుకు రెడీ

భారతీయ సినీ చరిత్రలో అద్భుత ప్రయోగాలు చేసిన దిగ్గజ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు, 94 ఏళ్ల వయసులో మళ్ళీ మెగాఫోన్ పట్టి సరికొత్త మ్యాజిక్ చేసేందుకు సిద్ధమయ్యారు. ఆయన దర్శకత్వం వహించడమే కాకుండా కీలక పాత్రలో నటించిన చిత్రం 'సింగ్ గీతం'. ఈ సినిమా టీజర్‌ను తాజాగా చిత్ర యూనిట్ విడుదల చేసింది. 'కల్కి 2898 ' దర్శకుడు నాగ్ అశ్విన్ ఈ చిత్రానికి సమర్పకుడిగా వ్యవహరిస్తుండటం విశేషం. టీజర్ చూస్తుంటే ఒక వైవిధ్యమైన కథాంశంతో, సంగీత ప్రాధాన్యత ఉన్న చిత్రంగా ఇది కనిపిస్తోంది. స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ దేవి శ్రీ ప్రసాద్ ఈ చిత్రానికి అద్భుతమైన నేపథ్య సంగీతాన్ని అందించారు. జూన్ 11వ తేదీన ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ వయసులో కూడా ఆయనలోని ఉత్సాహం చూసి సినీ ప్రముఖులు మరియు అభిమానులు ఆశ్చర్యపోతున్నారు.

# ఆస్కార్ అవార్డుల్లో సరికొత్త నిబంధనలు

### టాలెంట్‌ను ప్రోత్సహిచే విధంగా మార్పులు



ప్రపంచ సినిమా రంగంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ఆస్కార్ అవార్డుల 99వ ఎడిషన్ కోసం అకాడమీ సరికొత్త నిబంధనలను తీసుకువచ్చింది. 2027 ఆస్కార్ అవార్డులకు సంబంధించి అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ యాక్టింగ్, అంతర్జాతీయ సినిమాలు, సాంకేతిక విభాగాల్లో కీలక మార్పులు చేసింది. కొత్త నిబంధనల ప్రకారం.. ఒకే నటుడు ఒకే జాబితాలో రెండు వేరువేరు సినిమాలకు నామినేట్ అయ్యే అవకాశం ఉంది. ఇప్పటివరకూ నటీనటులు ఒక విభాగంలో ఒక సినిమాకు మాత్రమే నామినేట్ అయ్యే అవకాశం ఉండేది. దీనివల్ల టాలెంట్ ఉన్న నటులు ఒకే ఏడాది ఎన్ని చిత్రాల్లో గొప్ప ప్రదర్శనలు ఇచ్చినా, ఏదో ఒకదానితోనే సరిపెట్టుకోవాల్సి వచ్చేది. ఇకపై ఈ నిబంధనను తొలగించి ఎన్ని సినిమాలకు అయినా నామినేట్ చేసుకునే అవకాశాన్ని అకాడమీ కల్పించింది. అంతర్జాతీయ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో కూడా అకాడమీ కీలక మార్పులు చేసింది. ఒక దేశం నుంచి ఇప్పుడు ఒకటి కంటే ఎక్కువ సినిమాలు నామినేషన్లకు అర్హత సాధించొచ్చు. అలాగే, కేన్స్ లాంటి ప్రముఖ అంతర్జాతీయ చలనచిత్ర వేడుకల్లో అగ్ర పురస్కారాలు అందుకున్న సినిమాలు నేరుగా ఆస్కార్ బరిలో పోటీపడే అవకాశాన్ని కూడా అకాడమీ కల్పించింది. మరోవైపు అంతర్జాతీయ సినిమా కేటగిరీలో ట్రోఫీపై దేశం పేరుతో పాటు దర్శకుడి పేరును కూడా ముద్రించనున్నారు. సినిమా రంగంలో పెరుగుతున్న కృత్రిమ మేధ వినియోగంపై అకాడమీ కఠిన నిర్ణయం తీసుకుంది. రైటింగ్ (స్క్రీన్‌ప్లే) విభాగంలో రచయితలు రాసిన కథలను మాత్రమే పరిగణనలోకి తీసుకోనున్నట్లు తెలిపింది. ఏఐ సహాయంతో రాసిన వాటిని అనుమతించబోమని వెల్లడించింది. యాక్టింగ్‌లో కూడా కృత్రిమ మేధతో సృష్టించిన సీన్స్, మార్పులు చేసిన ప్రదర్శనలను అంగీకరించబోమని స్పష్టం చేసింది (ంఇ-జీటకపా ఃజీనిబ ంఎ). నటీనటులు నేరుగా చేసిన ప్రదర్శనలకే అవార్డులు ఇవ్వనున్నట్లు తెలిపింది. వచ్చే ఏడాది ఆస్కార్ అవార్డుల వేడుకలో ఈ నిబంధనలు అమలుకానున్నాయి. 99వ ఆస్కార్ అవార్డుల వేడుక మార్చి 14న లాస్ ఏంజెలెస్‌లో ఘనంగా జరగనుంది.

# వైభవ్ సూర్యవంశీని ఐపీఎల్ నుంచి తొలగించాలి

### ఐపీఎల్ నుంచి తొలగించాలని ఓ యాక్టివిస్ట్ డిమాండ్

రాజస్థాన్ రాయల్స్ టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీని వెంటనే ఐపీఎల్ నుంచి తొలగించాలని ఓ యాక్టివిస్ట్ డిమాండ్ చేశాడు. లేకపోతే రాజస్థాన్ రాయల్స్ యాజమాన్యంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించాడు. 15 ఏళ్ల పిల్లాడు ప్రొఫెషనల్ క్రికెట్ ఆడకూడదని, ఇలా చేయడం చైల్డ్ లేబర్ కిందకు వస్తుందని పేర్కొన్నాడు. వైభవ్ సూర్యవంశీ క్రికెట్‌ను పక్కనపెట్టి చదవుకోవాలని హితవు పలికాడు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. అయితే 12 ఏళ్ల వయసు నుంచే వైభవ్ సూర్యవంశీ ప్రొఫెషనల్ క్రికెట్ ఆడుతున్నాడు.బిహార్ తరపున 12 ఏళ్ల వయసులోనే దేశవాళీ క్రికెట్‌లోకి అరంగేట్రం చేసి ఈ ఘనత సాధించిన అతిపిన్న వయస్కుడిగా వరల్డ్ రికార్డ్ నమోదు చేశాడు. ఆ తర్వాత భారత అండర్ 19 జట్టుకు ఎంపికైన వైభవ్.. ఆసియా రైజింగ్ స్టార్స్ టోర్నీలో కూడా బరిలోకి దిగాడు. అండర్ 19 ప్రపంచకప్ ఆడి భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు.14 ఏళ్ల వయసులో ఐపీఎల్‌లోకి అరంగేట్రం చేయడంతో పాటు 35 బంతుల్లోనే సెంచరీబాది ఈ ఘనతను అందుకున్న పిన్న వయస్కుడిగా చరిత్రకెక్కాడు. ఇటీవలే 15వ జన్మదినం జరుపుకున్న వైభవ్ సూర్యవంశీ.. ఐపీఎల్ 2026 సీజన్‌లో దుమ్మురేపుతున్నాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై 36 బంతుల్లోనే సెంచరీ బాదాడు. 10 మ్యాచ్‌ల్లో 404 పరుగులు చేసి అత్యధిక పరుగుల బ్యాటర్ల జాబితాలో టాప్ 4లో కొనసాగుతున్నాడు. ప్రస్తుతం వైభవ్ సూర్యవంశీ టాక్ ఆఫ్ ది నేషన్‌గా మారాడు. అతను ఆడినా.. విఫలమైనా దేశం మొత్తం చర్చించుకుంటున్నారు. ఐకాన్ ప్లేయర్‌గా ఎదిగిన వైభవ్ సూర్యవంశీపై కన్నడ టీవీ ప్రోగ్రామ్‌లో యాక్టివిస్ట్‌గా పరిచయం చేసుకున్న వ్యక్తి సంచలన వ్యాఖ్యలు చేశాడు. వైభవ్‌ను



ఐపీఎల్ నుంచి తొలగించి స్కూల్‌కు పంపాలని డిమాండ్ చేశాడు.